
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

****



నల్లగొండ

5

శుక్రవారం 24 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.117	190	210
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 17.0



డిండి-ఏదుల లింక్‌కు
త్వరలో టెండర్లు

- రూ.1800.62కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు
- మార్చిలోపు టెండర్లు ఖరారుచేసే అవకాశం
- డిండి ప్రాజెక్టుతో నల్లగొండ జిల్లా సస్యశ్యామలం
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాలకు సాగునీరందించే డిండి ఎత్తిపోతల పథకానికి త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పథకంలో కీలకమైన డిండి-ఏదుల లింక్‌కు సంబంధించిన పనులను రూ.1800.60కోట్లతో చేపట్టేందుకు రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించిన తుది డిజైన్లను ఖరారు చేసిన వెంటనే టెండర్లను ఆహ్వానించాలని ఇటీవల నిర్వహించిన క్యాబినెట్‌లో నిర్ణయించిన నేపథ్యంలో త్వరలో టెండర్ల ప్రక్రియ మొదలవనుంది. మార్చిలోపే టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులకు సూచించింది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

డిండి-ఏదుల లింక్ పనులతో పాటు, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రధాన కాల్వ, రిజర్వాయర్ల నిర్మాణ పనులను రానున్న మూడేళ్లలో పూర్తిచేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరందించే ఈ పథకానికి ఉన్న ఆటంకాలు ఒక్కోటిగా తొలగిపోతున్నాయి. ఈ ప్రాజెక్టుకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచే అర టీఎంసీ నీటిని తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినా, గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ నుంచి తరలించాలనే విషయాన్ని తేల్చలేకపోయారు. అయితే దిగువన రిజర్వాయర్ల, ప్రధాన కాల్వ నిర్మాణ పనులు మాత్రం గత ప్రభుత్వం కొనసాగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని సేకరించాలని నిర్ణయించింది. రోజుకు అర టీఎంసీ

మిగతా 7వ పేజీలో...

బీఆర్ఎస్ పాలనలో పడావుపడ్డ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం



ఉమ్మడి జిల్లాలో ఫ్లోరైడ్ పీడ విరగడ చేసేందుకు కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పడావు పెట్టింది. మేం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేయిస్తున్నాం. అధికారంపోయిందనే బాధతో కుటిల రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాలు పదేళ్లగా జిల్లా ప్రాజెక్టులను ఎందుకు నిర్లక్ష్యం చేశాయో ప్రజలకు సమాధానం చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు నల్లగొండ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసినవారు, ఇప్పుడు అధికారం లేకపోవడంతో జిల్లాపై పడుతున్నారు. జిల్లాలో కరువును శాశ్వతంగా పారదోలే డిండి ఎత్తిపోతల పథకానికి రూ.6,190కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు. వచ్చే మూడేళ్లలో ఈ పథకాన్ని పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. డిండి, సింగరాజుపల్లి, గోకారం, గొట్టిముక్కల, ఇర్విన్, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లను కృష్ణాజలాలతో నింపి ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం. దశాబ్దాల ఫ్లోరైడ్ పీడను విరగడ చేస్తాం. దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న జిల్లాను అన్ని రంగాల్లో ప్రజా ప్రభుత్వ హయంలో అభివృద్ధి చేస్తాం.

● కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి

నిల్వాలపై నిఘా

- ఎరువుల కొరత సృష్టించకుండా వ్యవసాయశాఖ చర్యలు
- దుకాణాలపై నిరంతరం పర్యవేక్షణ, తనిఖీలకు బృందాల ఏర్పాటు



యాదాద్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలకు వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. జిల్లా వ్యవసాయ అధికారి వారంలో ఐదు దుకాణాలు, ఏడీఏలు 10 దుకాణాలు, ఏవోలు 10 దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, స్టాక్ వివరాలు పరిశీలిస్తున్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం రూపొందించిన ఫర్టి ఇన్వెంటరీ వెరిఫికేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో దుకాణాల యజమానులు వారి రిజిస్టర్లలో ఎరువుల స్టాక్ వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా? దిగుమతి, విక్రయం మధ్య ఏమైనా తేడా ఉందా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. యాసంగి సీజన్ సాగు పనులు ముమ్మరం అయిన నేపథ్యంలో ఎరువుల విక్రయాలు ఊపందుకున్నాయి. రైతులకు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించేందుకు, సకాలంలో సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. వ్యవసాయ అధికారుల బృందం జిల్లాలో ఉన్న ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీచేసి, ఎరువుల విక్రయాలను పరిశీలించనుంది. ఈ మేరకు జిల్లాలోని డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలను సేకరిస్తున్నారు. డీలర్ల వద్ద ఉన్న పాత నిల్వలను అదే ధరలకు రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డీలర్ల వద్ద మిగిలిన ఎరువులను పాత ధరలకే విక్రయించాలని, కొత్త ధరలకు విక్రయించవద్దని స్పష్టంచేశారు. ఎరువుల కొనుగోళ్లు, స్టాక్, ధరల అంశాలను పరిశీలించేందుకు, కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. డీలర్ల వద్ద స్టాక్ ఉన్నంత వరకు ఎరువులను రైతులకు విక్రయించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

అందుబాటులో ఎరువులు

యాసంగిలో సాగుచేసే రైతులకు విత్తనాలు, ఎరువులను దుకాణాల్లో రైతులకు

మిగతా 6వ పేజీలో..

అర్హులకు సంక్షేమ పథకాలు

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్



పెద్దకాపర్తిలో మాట్లాడుతున్న అనితారామచంద్రన్, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాలరూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మహిళా శిశుసంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దకాపర్తిలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలకు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను పొదుపు చేసుకుని అత్యవసర సమయాల్లో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. గ్రామసభలో చదివిన జాబితాలో పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, పేరు లేకపోతే అనర్హులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గ్రామ సభలో దరఖాస్తు చేయనివారు ఎంపీడీవో కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఇది నిరంతరం ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. కాగా, మండలంలోని సుంకెనపల్లిలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. అర్హత ఉన్నా జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. అయితే పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని వారికి అధికారులు సూచించారు.

పౌష్టికాహారాన్ని సరిగా పంపిణీ చేయాలి

(ఆంధ్రజ్యోతి, చిట్యాల): చిన్న పిల్లలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఒకటో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి తనిఖీ చేశారు. చిన్నారులతో మాట్లాడారు. ప్రీస్కూల్ సామగ్రి, పౌష్టికాహార పంపిణీపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూట్రీషియన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం యాప్‌ను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ అపర్ణ, తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



వేములపల్లి ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వేములపల్లి, తిప్పర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం వేములపల్లి, తిప్పర్తి మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. హాజరు, ఓపీ, వ్యాక్సినేషన్, గర్భిణుల నమోదు రిజిస్టర్లను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు బాధితులు పెరుగుతున్నందున పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకొని కుక్కల బెడద తగ్గేలా చూడాలన్నారు. అవసరమైన చోట స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొని కుక్కలను సుదూర ప్రాంతాలకు లేదా సంరక్షణ కేంద్రాలకు తరలించాలన్నారు. పీహెచ్‌సీలో 24గంటల వైద్య సేవలతోపాటు కుక్క, పాము కాటు, రక్తహీనత ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నందున వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములపల్లి పీహెచ్‌సీకి కొన్ని వైద్య పరికరాలు కావాలని సిబ్బంది కోరగా, వాటికి అవసరమైన నిధులు ఆరోగ్యశ్రీ ద్వారా గానీ, తన నిధుల ద్వారా గానీ సమకూర్చుతానని హామీ ఇచ్చారు. అనంతరం వేములపల్లి మండల ప్రత్యేకాధికారిని గ్రామసభల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, వైద్యాధికారి సుచరిత, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో శారదాదేవి, సూపర్‌వైజర్ శాంతమ్మ, సిబ్బంది గీతావాణి, శాంతి, అరుణకుమారి, దేవేందర్, నరేందర్, తిప్పర్తి తహసీల్దార్ డి.స్వప్న, తదితరులు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఓట్లు తగ్గినా, విలువ తగ్గలేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

మిర్యాలగూడ. జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఓట్లు తగ్గినా విలువ తగ్గలేదని, నిజాయతీతో పనిచేస్తున్న కమ్యూనిస్టులంటే ప్రజల్లో గౌరవం భావం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం సీపీఎం నేత గాదె శ్రీనివాసరెడ్డి విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు ఈదులగూడెం చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి రెండు పార్టీల సహాయంతో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ రాజ్యాంగ సంస్థలను గుప్పిటపట్టుకుని మత విద్వేషాలను ప్రజలపై రుద్దుతోందని అన్నారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రవాస భారతీయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. తీవ్ర నిర్బంధ కాలంలో ధైర్యసహసాలతో ప్రజల పక్షాన నిలిచిన పోరాటయోధుడు గాదె శ్రీనివాసరెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నారి అయిలయ్య, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, భవాండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, గాదె శ్రీనివాసరెడ్డి సతీమణి, ఐద్వా నాయకురాలు గాదె పద్మమ్మ, కుమారులు గాదె ప్రభాకర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రం కోసం పోరాడిన వ్యక్తి నేతాజీ

ఆర్య ప్రతినిధి సభ ప్రధానకార్యదర్శి హరికిషన్ వేదాలంకార్



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హరికిషన్, తదితరులు

నల్లగొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్రం భిక్ష కాదని, పోరాటం ద్వారానే సాధించుకుందామనే నినాదంతో పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని ఆర్య ప్రతినిధి సభ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధానకార్యదర్శి హరికిషన్ వేదాలంకార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, పరాక్రమ దివస్, జనగణమన ఉత్సవ సమితి వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నేతా జీ రూపొందించిన ఆజాద్ హింద్ ఫౌజ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశ ప్రజల్లో స్వాతంత్య్ర కాంక్షను నింపిన విప్లవ నాయకుడు నేతాజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిత్య జనగణమన గీతాలాపన కేంద్రాల ఇన్‌చార్జీలను వారు సన్మానించారు. అనంతరం నేతాజీ జీవిత చరిత్రపై జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరామిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, కొలనుపాక రవికుమార్, దోసపాటి శ్రీనివాస్, పోలోజు నాగేంద్రాచారి, పోలా జనార్ధన్, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఆర్కే ప్రదీప్, కక్కిరేణి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నార్కట్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని చెర్వుగట్టు ఆలయం వద్ద పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నెల 2 నుంచి చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఉన్న నేపథ్యంలో పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ నంది సర్కిల్, పార్వతమ్మ ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గ్రామ పంచాయతీ వద్ద రోడ్లపైకి వచ్చిన దుకాణాలను వెనక్కి జరపాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సీఐ నాగరాజు, దేవస్థాన సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పవర్‌లూం కార్మికులు

నల్లగొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత పవర్‌లూమ్ సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పవర్‌లూమ్ కార్మికులు సుదీర్ఘకాలంగా సంక్షేమం కోసం పోరాడుతున్నారని, ప్రత్యామ్నాయ ఉపాధులేవీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత మిత్రను పెంచి నగదు బదిలీ ఇవ్వాలన్నారు. త్రిఫ్ట పథకం, నేతన్న బీమా పథకాలు ఉన్నా, అమలులో చిత్తశుద్ధి లేక లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదన్నారు. చేనేత బంధు కింద ప్రతీ కార్మికునికి రూ.10లక్షలు ఇవ్వాలని, ఈఎస్ఐ హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని మగ్గాలకు, అనుబంధం వృత్తులకు జియో ట్యాగ్ చేసి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహించి టెస్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. చేనేత ముడి సరుకులపై కేంద్రం జీఎస్టీ రద్దుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో చేనేతరంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ సిబ్బంది యూనిఫాం, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌కు చేనేత వస్త్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుండు వెంకటనర్సు, కర్నాటి వెంకటేశం, కందగట్ల గణేష్, రాపోలు వెంకన్న, గడ్డం దశరథ, గంజి నాగరాజు, జైనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి చక్రం, పనిఒత్తిడి భారం



- నిరంతర ఒత్తిడిలో ఆర్టీసీ డ్రైవర్లు
- ఆరోగ్యపరమైన ఇబ్బందులు
- 14 ఏళ్లుగా నిలిచిన డ్రైవర్ల నియామకం
- నేడు ఆర్టీసీ డ్రైవర్ల దినోత్సవం

దేశ ప్రగతికి రవాణా రంగమే పునాది. ఆ రవాణా రంగాన్ని నడిపిస్తుంది డ్రైవర్లు. సరుకులు మొదలు ప్రయాణికులను తరలిస్తూ డ్రైవర్లు దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారు. అలాంటి రవాణా రంగంలో కీలకమైన టీఎస్‌ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర గణనీయం. ప్రతి రోజూ లక్షల సంఖ్యలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. వారి సేవలకు గుర్తుగా ప్రతి ఏడాది జనవరి 24న ఆర్టీసీలో డ్రైవర్స్ డేను నిర్వహిస్తున్నారు. అయితే సంస్థ పురోభివృద్ధిలో ముందుంటున్నా వారు సంక్షేమంలో వెనకబడుతున్నారు. పనిఒత్తిడిలో అనారోగ్యానికి గురవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ఆర్టీసీలోని విభాగాల్లో డ్రైవర్ల విధులే కీలకం. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన నాటి నుంచి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాల్సి ఉన్నా ఆ దిశగా సంస్థ ఏర్పాట్లు చేయలేదు. మరోవైపు సరిపడా డ్రైవర్లు లేక ఉన్న వారితోనే పనిచేయిస్తుండడంతో వారు తీవ్రఒత్తిడికి గురవుతున్నారు. ఆర్టీసీలో చివరిసారిగా 2010లో సిబ్బంది నియామకం చేపట్టారు. అప్పటినుంచి నియామకాలు చేపట్టలేదు.

దశాబ్దానికి పైగా చేపట్టని నియామకాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏటా 50 నుంచి 100 మంది డ్రైవర్లు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. ఈ 14ఏళ్లలో సుమారు 1000 మందికి పైగా డ్రైవర్లు పదవీవిరమణ చేసినా కొత్త డ్రైవర్ల నియామకం చేపట్టలేదు. కొత్త బస్సులను కొనుగోలు చేయకపోవడంతో పాటు పాతబస్సుల స్థానంలో కొత్తవి తీసుకువస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 2021లో సుమారు 1,150 మంది డ్రైవర్లు ఉండగా 2023లో తగ్గారు. 2:6 నిష్పత్తి ప్రకారం సుమారు 1040 మంది డ్రైవర్లు ఉండాలి. కానీ కేవలం 818 మంది మాత్రమే ఉన్నారు. వారితోనే డబుల్ డ్యూటీలు చేయిస్తున్నారు. ఎనిమిది గంటలు విధులు నిర్వర్తించాల్సిన డ్రైవర్లు 16 గంటలకు పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో తమపై ఒత్తిడి పెరిగి అనారోగ్యాల బారిన పడుతున్నామని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు.

ఒత్తిడితో అనారోగ్యం...

ఆర్టీసీలో డ్రైవర్లు రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వంటి అనారోగ్యాల బారిన పడుతున్నారు. మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వెళ్లి రావాలంటే 9 గంటల సమయం పడుతుంది. ఆ వెంటనే అదనపు డ్యూటీ ఉండటంతో 18 గంటలు బస్సులోనే ఉంటున్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన ప్రయాణికులతో డ్రైవర్లకూ తరచూ వివిధ కారణాలతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. రద్దీ సమయంలో బస్సులో 140 మందికి పైగా ప్రయాణిస్తుండటంతో తరచూ బస్సు ఆపాల్సి వస్తుండటంతో తీవ్రఒత్తిడికి గురవుతున్నారు. కొన్నేళ్లుగా ఆర్టీసీలో డ్రైవర్ల నియామకం చేపట్టకపోవడంతో ఉన్న వారే విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మంది తమ ఇష్టప్రకారమే అదనపు డ్యూటీలు చేస్తున్నారు. దీనికిగాను రూ.1000 వరకు సంస్థ చెల్లిస్తోంది. అయితే అనేకమంది పనిఒత్తిడి కారణంగా అనారోగ్యాల పాలవుతున్నారు. దీనిని నివారించేందుకు ఆర్టీసీలో నియామకాలు చేపట్టాల్సి ఉంది.



సంస్థ అభివృద్ధి కోసం డబుల్ డ్యూటీలు

డబుల్ డ్యూటీ చేయడం కష్టమైనా సంస్థ అభివృద్ధి కోసం చేస్తున్నాం. డ్రైవర్ల సంఖ్యను పెంచడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచాలి. పనిభారం పెరగడంతో ఆరోగ్య సమస్యలూ వస్తున్నాయి. ఒక్కో డ్రైవర్ 11 గంటలకు పైగా చేయాల్సివస్తోంది. ట్రాఫిక్ సమస్యలు ఎదురైతే మరింత పనిఒత్తిడి పెరుగుతుంది. యూనియన్లను పునరుద్ధరించాలి.

కొంపల్లి జమాల్‌గౌడ్, సీనియర్ డ్రైవర్



డ్రైవర్ల కోసం గ్రాండ్ హెల్త్ కార్యక్రమం

సంస్థలో ఉద్యోగుల ఆరోగ్యం కోసం గ్రాండ్ హెల్త్ కార్యక్రమం చేపట్టాం. 45ఏళ్లు నిండిన డ్రైవర్లకు మూడేళ్లకోసారి ఆరోగ్యపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఏటా గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరుతో వైద్యపరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నాం. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించడంతో పాటు ఔషధాలు కూడా అందజేస్తున్నాం.

కే జానిరెడ్డి, ఆర్ఎం, నల్లగొండ

యూనియన్లు లేకపోవడంతో...

బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే ఆర్టీసీ యూనియన్లకు బాధ్యతలు లేకపోవడం, ఎన్నికలు లేకపోవడతో డ్రైవర్ల సమస్యలు, ఇతర కార్మికుల సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారు. యూనియన్లు ఉన్నప్పుడు ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి పరిష్కరించుకునే వారు. ఆర్టీసీలో పని భారం పెరిగి డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రశ్నించే గొంతులు లేవని డ్రైవర్లు వాపోతున్నారు. యూనియన్లు ఉంటే బస్సుల సంఖ్య, డ్రైవర్ల అవసరం, ఇతర సమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేందంటున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యూనియన్లను తిరిగి పునరరుద్ధరిస్తారన్న నమ్మకం డ్రైవర్లలో ఉన్నా అది ఆచరణలోకి ఇంకా రాలేదు.

ఇటీవల ప్రమాదాలు

- జనవరిలో చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురంలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు, పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.
- ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ సలీంబాషా అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఏడాది కిందట మిర్యాలగూడ డిపోకు చెందిన ఓ ఆర్టీసీ డ్రైవర్ విధుల్లో ఉండగానే గుండెపోటుకు గురై బస్సులోనే మృతి చెందాడు.

భయాందోళనలో ఉప్పలంచ

- ఆగని హత్యల పరంపర
- మల్లయ్య హత్యతో ఇది నాల్గోది

శాలిగౌరారం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఉప్పలంచ కుగ్రామం. ఈ చిన్న గ్రామంలో 1000 జనాభా, 700 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామంలో ఆధిపత్యం కోసం గత 35 ఏళ్లలో నలుగురు హత్యకు గురయ్యారు. ఇటీవల మరోసారి హత్యతో గ్రామస్థుల్లో భయాందోళన మొదలైంది. ఇక్కడ ఏ హత్య జరిగినా జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. నిందితుల గుర్తింపు పోలీసులకు సవాల్‌గా మరుతున్నాయి. హత్యోదంతాల్లో జైలు జీవితం గడిపి వచ్చిన వారే హత్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటివరకు సీపీఎం, టీడీపీలకు చెందిన ఒక్కొక్కరు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారుఇద్దరు హత్యలకు గురయ్యారు.

నర్సయ్యతో మొదలై...

కాంగ్రెస్ నాయకుడు సంగపాక నర్సయ్య 1990 ఆగస్టులో, సర్పంచ్ లూర్థయ్య(సీపీఎం) 1990 నవంబరులో, గార్లపాటి అనంతరెడ్డి(టీడీపీ) 2000 నవంబరులో హత్యకు గురయ్యారు. తాజాగా మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య (కాంగ్రెస్) హత్యతో నాల్గో హత్య ఇది.

ఒకనాడు ప్రధాన నిందితుడు..

మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. ఒకప్పుడు గ్రామానికి చెందిన గార్లపాటి అనంతరెడ్డికి ముఖ్యఅనుచరుడిగా ఉండేవాడు. ఉప్పలంచ గ్రామంపై అనంతరెడ్డికి పట్టు ఉండేది. 1995వ సంవత్సరంలో సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వు కావడంతో తన భార్యకు టికెట్ ఇవ్వాలని మల్లయ్య అనంతరెడ్డిని కోరాడు. మల్లయ్య భార్యకు టికెట్ ఇవ్వకుండా మరొకరిని అనంతరెడ్డి ఏకగ్రీవంగా సర్పంచ్ చేశాడు. 2000 నవంబరులో గార్లపాటి అనంతరెడ్డి హత్యకు గురికాగా ఆ కేసులో బండారు మల్లయ్య ఏ-1గా ఉండి కొన్నాళ్లు జైలు జీవితం గడిపాడు. జైలు నుంచి వచ్చిన తరువాత మల్లయ్య ఉప్పలంచ గ్రామంపై రాజకీయంగా పట్టు సాధించాడు. 2006, 2019లో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశాడు. మల్లయ్యకు మంచి పలుకుబడి ఉన్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో మల్లయ్యను అడ్డుతొలగించుకోవాలని ఓ పార్టీ ప్రధాన నాయకులు పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.



ఉప్పలంచలో పోలీస్ పహారా



మొదటిసారి హత్యకు గురైన సంగపాక నర్సయ్య స్థూపం

భారీ బందోబస్తు మధ్య మల్లయ్య అంత్యక్రియలు

నివాళులర్పించిన ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం

హత్యకు గురైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య అంత్యక్రియలు గురువారం రాత్రి ఉప్పలంచ గ్రామంలో భారీ బందోబస్తు మధ్య జరిగాయి. బంధువులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. బుధవారం రాత్రి మల్లయ్య మృతి చెందగా గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. ప్రజల సందర్శనార్థం గంట సేపు ఇంటి ముందు ఉంచారు. తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంలు మల్లయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మల్లయ్య భార్య, కుమార్తెలను ఓదార్చారు. కుటుంబానికి అన్నివిధాలా ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలన్నారు. మల్లయ్య కుమార్తె ముందు నడిచి తలకొరివి పెట్టింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరుగకుండా నకిరేకల్, శాలిగౌరారం సీఐలు రాజశేఖర్, కొండల్‌రెడ్డి, ఎస్ఐలు సైదులు, శివతేజ, ఏఎస్ఐ, స్పెషల్‌పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అంతిమయాత్రలో ఎమ్మెల్యే వీరేశం సతీమణి పుష్ప, తహసీల్దార్ పీ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, చాడ సురేష్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్, గూని వెంకటయ్య, నరిగే నర్సింహా, దొంతూరి రామచంద్రు, తీరుపారి మల్లయ్య, కట్టగూరి సురేందర్ రెడ్డి, శానాల యుగేందర్ రెడ్డి, కొమరయ్య, ధనుంజయ, గోపినాథ్, బోడ అరుణ్, బొల్లికొండ గణేష్, మహేష్, నాయకులు పాల్గొన్నారు.





మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వీరేశం, సామేల్

పశువుల దొంగ అరెస్ట్

తిప్పర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాత్రి వేళల్లో పశువులను చోరీ చేసి వధిస్తున్న ముఠాను నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 14న తేదీన తిప్పర్తి మండలకేంద్రానికి చెందిన రైతు రొట్టెల జానయ్య తన ఇంటి ముందు ఉన్న కొట్టంలో రూ.1.60 లక్షల విలువైన రెండు ఆవులను కట్టేసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై రైతు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు గురువారం ఉదయం తెల్లవారుజామున అనిశెట్టి దుప్పలపల్లి గ్రామం వద్ద పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఓ కారు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గమనించి తనిఖీచేశారు. వాహనంలో పశువులను చోరీ చేస్తున్న ఆనవాళ్లు గమనించిన తిప్పర్తి స్టేషన్‌కు తరలించి విచారించారు. గత ఆరు నెలలుగా తిప్పర్తి, కట్టంగూరు, నార్కట్‌పల్లి పోలీస్ పరిధిలలో హైవే వెంట ఉన్న పలు గ్రామాల్లో పశువులను చోరీ చేసినట్లుగా నిందితుడు ఎండీ అమీర్ ఖురేషి ఒప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం వీరు ఈ నెల 14వ తేదీన తిప్పర్తిలో చోరిచేసిన రెండు ఆవులను కూడా చిట్యాల రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ దాబా హోటల్ వద్ద ఉంచినట్లు తెలపడంతో వాటిని తీసుకొచ్చి బాధిత రైతుకు అప్పగించారు. ఇతడితో పాటు చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులు మహమ్మద్ జమీల్ ఖురేషి, సయ్యద్ రఫీద్దిన్‌లు పరారీలో ఉన్నట్లు సమాచారం. నేరస్తులైన వీరు రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన వారుగా పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి రెండు ఆవులతో రూ.1.60 లక్షల నగదును రికవరీ చేసి, ఖురేషిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.



రైతుకు ఆవులను అప్పగిస్తున్న పోలీసులు

మోటార్ సైకిల్ నుంచి రూ.1.40 లక్షలు చోరీ

హుజూర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఓ రైతు మోటార్‌సైకిల్ నుంచి రూ.1.40 లక్షల నగదు చోరీకి గురైంది. స్థానిక బ్యాంక్‌లో తనఖా పెట్టిన బంగారాన్ని తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ రైతు మోటార్ సైకిల్ నుంచి నగదును తస్కరించారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం అమరవరం గ్రామానికి చెందిన రైతు కనుకుంట్ల రామయ్య గురువారం ఉదయం పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో గతంలో తనఖా పెట్టిన బంగారాన్ని తీసుకెళ్లేందుకు వచ్చాడు. ఈ సమయంలో హుజూర్‌నగర్‌లోని లింగగిరి రోడ్డులోని పోంచర్ల వైన్ షాపు ఎదురుగా బండి ఆపి మరొకరితో మాట్లాడి వచ్చే సరికి గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచిన రూ.1.40 లక్షలు చోరీ చేశారు. గమనించిన బాధితుడు రామయ్య, పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఫిర్యాదుచేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిల్వలపై నిఘా

(5వ పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటుంది. జిల్లావ్యాప్తంగా యాసంగిలో 58,346 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయి. వీటిలో యూరియా, డీఏపీ, ఎంవోపీ, కాంప్లెక్సు తదితర ఎరువులు ఉంటాయి. ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం అధికంగా ఉంటుంది. అనంతరం యూరియాతోపాటు మరికొన్ని కాంప్లెక్స్ ఎరువుల వాడకం ఉంటుంది. దీంతో రైతులకు కావాల్సిన ఎరువులను దశలవారీగా పంపిణీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ప్రస్తుతం జిల్లాలో డీఏపీ 8,305 మెట్రిక్‌టన్నులు, యూరియా 234.590 మెట్రిక్‌టన్నులు, ఎంవోపీ ఎరువులు 550.600 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ ఎరువులు 406.450 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3,564 మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ప్రతీ డీలర్ ఎరువుల కొనుగోలుకు సంబంధించిన బిల్లులు తప్పకుండా ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు.

ఎరువుల స్టాక్‌పై పర్యవేక్షణ

యాసంగిలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లాలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. డీఏవో ఐదు దుకాణాలు, ఏడీఏ, ఏవోలు వారానికి 10 దుకాణాలను తనిఖీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ. జిల్లావ్యాప్తంగా అన్ని షాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేస్తాం

గోపాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

నకిలీ వేబిల్లుతో ఇసుక అక్రమ రవాణా

మిర్యాలగూడ. జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు. గురువారం నకిలీ వేబిల్లులతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి ఇసుకను అక్రమంగా మిర్యాలగూడకు తరలిస్తున్న టిప్పర్‌ను స్థానికులు అడ్డుకుని రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం ఇసుక రీచ్ నుంచి జిల్లా మర్రిగూడెం మండలం శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులకు ఇసుక తరలిస్తున్నట్లుగా వేబిల్లులు తీసుకున్నారు. బిల్లులో నమోదు చేసిన విధంగా కాకుండా 47టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్‌లో 64 టన్నుల ఇసుకను వంగమర్తి నుంచి మిర్యాలగూడకు తరలిస్తున్నారు. స్థానిక ఇసుక టిప్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిప్పర్‌ను పట్టుకుని రవాణాశాఖ అధికారులకు అప్పగించడంతో వాహన పత్రాలు తనిఖీ చేసి సామర్థ్యానికి మించి ఇసుకను రవాణా చేస్తుండటంతో కేసు నమోదు చేసి టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎంవీఐ వీరస్వామి తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ఇసుక అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్టవేయాలని ఇసుక టిప్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన తెలిపారు. ప్రభుత్వ అనుమతులు పొందిన వాహనాలకు ఇలాంటి చర్యలతో నష్టం జరుగుతోందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించమని కోరుతామని అసోసియేషన్ అధ్యక్షుడు వసీం తెలిపారు. నిరసన తెలిపిన వారిలో అసోసియేషన్ సభ్యులు కిరణ్‌కుమార్, శ్రీకాంత్, సాయి, నాగరాజు, కోటేష్, కృష్ణ, విజయ్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌ట్యాంకర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

చిలుకూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన షేక్ ఖాసీం సాహెబ్(75) కోదాడ-హుజూర్‌నగర్ రహదారిపై బేతవోలు క్రాస్‌రోడ్డు వద్ద మోపెడ్‌పై రోడ్డు దాటుతున్నాడు. హుజూర్‌నగర్ నుంచి కోదాడకు వెళ్తున్న హెచ్‌పీ ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ కింద ఇరుక్కున్న మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



ఖాసీం సాహెబ్(ఫైల్‌ఫొటో)

పతకాల పోలీస్.. శ్రీధర్‌రెడ్డి

- 2015లో రాష్ట్ర శౌర్య పతకం
- 2024లో కేంద్ర దక్షత పతకం
- 2023లో భారత పోలీస్ పతకం





ఐక్యరాజ్య సమితి ప్రతినిధి నుంచి ఉత్తమ సేవా పతకం అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

జీవితం ఆనందంగా సాగాలంటే ప్రభుత్వ ఉద్యోగం ఉంటే చాలు అనుకుంటుంటాం. 26 ఏళ్ల కిందట ఓ యువకుడికి ఒకే సమయంలో ఎంపీడీవో, ఎస్ఐ ఉద్యోగాలు వచ్చాయి. పీపుల్స్ వార్ ప్రాబల్యంగా ఉన్న సమయం, నిత్యం ఏదో ఒక చోట ఎన్‌కౌంటర్లు, దాడులు. ఇలాంటి సమయంలో ఎక్కువ మంది ఏ ఉద్యోగాన్ని ఎంచుకుంటారు. సాఫీగా సాగిపోయే ఎండీపీవో ఉద్యోగాన్నే. కానీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ఎస్ఐ ఉద్యోగాన్ని ఎంచుకున్నాడు. పోలీస్ ఉద్యోగమంటే ఆయనకు మమకారం, కుటుంబ నేపథ్యం రెండూ ఆ వైపుగా ఆయన్ను నడిపించాయి. కాలం గడిచేకొద్దీ విధి నిర్వహణలో ఆయన ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అంతర్జాతీయ స్థాయి ప్రశంసలు, దేశస్థాయి పతకాలు అందుకున్నారు. 26 ఏళ్లలో 200 లకు పైగా అవార్డులు, ప్రశంసాపత్రాలు, రివార్డులు అందుకున్నారు. కోదాడ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీధర్‌రెడ్డి పతకాల పోలీస్‌గా పేరొందారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఇరవై ఆరు సంవత్సరాల సుదీర్ఘ సర్వీసులో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ప్రదర్శించిన వృత్తి నైపుణ్యానికి 11 పోలీస్ మెడల్స్, ప్రశంసా పత్రాలు, క్యాష్‌రివార్డు వరించాయి. కీలకమైన శాంతిభద్రతలు, సామాజిక విషయాల్లో, పోలీసు ప్రజాసంబంధాలను పటిష్ఠం చేయటం, తీవ్రవాద, దోపిడీ, మానవ అక్రమ రవాణా, అక్రమ ఆయుధాల కేసుల్లో ప్రతిభా పాటవాలకు అనేక పతకాలు ఆయన్ను వరించాయి.

గ్రూప్-1 ఉద్యోగాన్ని వదులుకుని...

ఒకప్పుడు శ్రీధర్‌రెడ్డి పూర్వికులది నల్లగొండ జిల్లా మునుగోడు మండలం. తండ్రి కృష్ణారెడ్డి. వరంగల్‌కు వలస వెళ్లి అక్కడే స్థిరపడిపోయారు. ఆయన ఎస్ఐగా పనిచేసి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. శ్రీధర్‌రెడ్డి మేనమామ కూడా పోలీస్ అధికారే. దీంతో ఆయనకు పోలీస్ డిపార్ట్‌మెంట్ అంటే అత్యంత ఇష్టం. 1998లో ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్న శ్రీధర్‌రెడ్డికి ఒకే సమయంలో రెండు ఉద్యోగాలు వరించాయి. ఎంపీడీవో(గ్రూప్-1 స్థాయి), ఎస్ఐ ఉద్యోగాలు వచ్చాయి. పీపుల్స్ వార్ బలంగా ఉం డటం, పోలీసుల విధి నిర్వహణ సంకటంగా ఉన్న సమయం కావడంతో సాధారణంగా ఎవరైనా ఎంపీడీవో ఉద్యోగాన్నే ఎంచుకుంటారు. కానీ శ్రీధర్‌రెడ్డి ఎస్ఐ ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. శిక్షణ అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. తిరుమలగిరి, కట్టంగూరు, మర్రిగూడ, కేతేపల్లి, చౌటుప్పల్, నల్లగొండతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లలో 2010 వరకు పనిచేశారు.

వివిధ విభాగాల్లోనూ సేవలు

- పదోన్నతిపై ఇంటలిజెన్స్ విభాగంలో మూడేళ్లు పనిచేశారు.
- కోదాడ, రామన్నపేటలలో సీఐగా పనిచేశారు.
- ప్రతిష్మాకమైన ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళానికి దేశం తరుపున ఎంపికై 2016-17 లాటిన్ అమెరికా దేశం హైతీలో పోలీస్ ఆపరేషన్స్ ప్లానింగ్ అధికారిగా పనిచేశారు.
- రాచకొండ కమిషనరేట్‌లో హయత్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా రెండునెలలు పనిచేశారు. అదే సమయంలో అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకొని రూ.40 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసి, నేరస్థులకు శిక్షపడేలా దర్యాప్తు చేసి, పీడీ చట్టాన్ని ఉపయోగించారు.
- రాచకొండ కమిషనరేట్‌లో ఐటీ విభాగాన్ని పూర్తిస్థాయిలో పటిష్ట పరుస్తూ తనదైన శైలీలో పనిచేస్తూ అనేక కేసుల చేదనలో కీలకపాత్ర పోషించారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్(సీసీటీఎన్ఎస్) ద్వారా పోలీసు రికార్డుల కంప్యూటరీకరణలో, డయల్-100 విభాగం పనితీరును మెరుగు పర్చడంలోనూ ఆయన కృషి చేసి డీజీపీ, రాచకొండ పోలీస్ అధికారులతో ప్రశంసలు అందుకున్నారు.
- బాలికలపై హత్యాచారాలకు సంబంధించిన రాష్ట్రంలో సంచలనం రేపిన హాజీపూర్ కేసులో, తనదైన శైలిలో సాంకేతికత ఉపయోగించి నిందితుడిని స్వల్పకాలంలోనే అరెస్టు చేయటంలో కీలకపాత్ర పోషించారు.
- 2023లో డీఎస్పీగా పదోన్నతిపై నల్లగొండ మొదటి పోస్టింగ్ రాగా, 2024 ఫిబ్రవరిలో బదిలీపై కోదాడకు వచ్చారు.

పతకాలు, రివార్డులు

- జాతీయ సమైక్యత దినోత్సవం(సర్దార్ వల్లబాయ్‌పటేల్ జయంతి)ను పురస్కరించుకుని 2024 సంవత్సరానికి గాను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దక్షత పతకానికి శ్రీధర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ పతకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నుంచి అందుకున్నారు.
- 2023లో ప్రతిష్ఠాత్మక భారత్ పోలీస్ పతకాన్ని కేంద్ర ప్రభుత్వం బహూకరించింది.
- 2009లో విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలకు సేవా పతకం. 2015లో రాష్ట్ర శౌర్యపతకం. పంజాబ్‌లో అఖిల భారతస్థాయి డ్యూటీమీట్‌లో ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో రజత పతకం. 2016లో ఉత్తమ సేవా పతకం.
- 2017లో ఐక్యరాజ్యసమితి నుంచి శాంతి పతకాన్ని సాదించారు.

అందరి సహకారంతోనే...

విధి నిర్వహణలో అనేక ఒడిదుడుకులను అధిగమించి ఉన్నతాధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకంతోనే పనిచేయగలిగాం. వారి వల్లే అనేకమంది దొంగలను పట్టుకున్నాం. త్వరతగతిన కేసులను ఛేదించగలిగాం. కేంద్రప్రభుత్వ అవార్డు రావటం సంతోషంగా ఉంది.

మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ కోదాడ

వాగులోకి ఒరిగిన కారు: ఇద్దరికి స్వల్ప గాయాలు

రాజాపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో కాజ్‌వే పైనుంచి కారు వాగులోకి ఒరిగి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలానికి చెందిన చెందిన ఉప్పల శ్రీనివాస్ తన కుమార్తెతో కలిసి గురువారం ఉదయం 6 గంటలకు జనగాం బయలుదేరారు. ఈ క్రమంలో పొట్టిమర్రి వాగు వద్ద లోలెవెల్ కాజ్‌వేపై ప్రయాణిస్తున్నారు. పొగమంచుతో వాగులో గుంతలు, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో లోలెవల్ కాజ్‌వే నుంచి కారు వాగులోకి ఒరిగింది. దీంతో శ్రీనివాస్‌తో పాటు ఆయన కుమార్తెకు స్వల్పగాయాలయ్యాయి. అనంతరం క్రేన్ సహాయంతో కారును బయటకుతీశారు.



కాజ్‌వే నుంచి వాగులోకి ఒరిగిన కారు

క్రీడలతో స్నేహభావం పెంపు

సాగర్‌లో ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల పోటీలు ప్రారంభం

నాగార్జునసాగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం, శారీరక దృఢత్వం పెరుగుతుందని నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య అన్నారు. ఉమ్మడి నల్లగొండ స్థాయి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల స్థాయి క్రీడా పోటీలను సాగర్‌లోని హిల్‌కాలనీలో నాట్కో ఫార్మా ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్‌లతో గురువారం కలిసి ఆయన ప్రారంభించారు. ఇదిలా ఉండగా మొదటి రోజు ఏడు కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు


నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామి అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.14,99,455ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

జాతర టెండర్ల ఆదాయం రూ.52.66లక్షలు

చివ్వెంల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో జాతరైన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని పెద్దగట్టు(గొల్లగట్టు) లింగమంతుల స్వామి జాతరకు సంబంధించిన బహిరంగ వేలం టెండర్లను గురువారం దేవాదాయశాఖ అధికారి ఈవో కుశలయ్య నిర్వహించారు. ఫిబ్రవరి 16వ తేదీ నుంచి ప్రారంభంకానున్న జాతరకు సంబంధించిన వేలాన్ని దేవాలయ ప్రాంగణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. గుట్ట పై భాగంలో కొబ్బరికాయలు విక్రయించే హక్కును రూ.26,66,666లకు టెండర్ వేసిన మద్దెబోయిన శ్రీనివాస్ దక్కించుకున్నారు. గతంలో ఈ కొబ్బరికాయల వేలం రూ.8లక్షలకు పాడారు. లడ్డు, పులిహోర విక్రయ టెండర్‌ను రూ.12,50000లకు ధరావత్ మణికుమార్ దక్కించుకున్నారు. గంతలో ఈ వేలం రూ. 3,80000లకు పోయిం ది. అదేవిధంగా తలనీలాల టెండర్‌ను రూ.10,25000లకు తన్నీరు లింగయ్య దక్కించుకున్నాడు. గతంలో ఈపాట రూ. 6,67,000కు దక్కింది. అదేవిధంగా పచ్చికొబ్బరికాయల సేకరణకు హక్కును రూ.3,25,000లకు అలిశెట్టి రాజు దక్కించుకున్నాడు. నాయీబ్రహ్మణ హక్కు పాట వాయిదా వేశారు. గతంలో ఈ వేలాన్ని రూ. 1,60,000కు దక్కింది. మొత్తంగా గత జాతరకు వేలం ద్వారా ఆలయానికి ఆదాయం రూ.20,07000 రాగా ప్రస్తుతం రూ.52,66,666 వచ్చింది. ఈ జాతరకు గతంలో కంటే రూ.32,59,666ల ఆదాయం పెరిగింది.

డిండి-ఏదుల లింక్‌కు త్వరలో టెండర్లు

(5వ పేజీ తరువాయి)

చొప్పున వరద వచ్చే సీజన్‌లో 60 రోజుల పాటు 30టీఎంసీల నీటిని తరలించాలని గత ఏడాది మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఆ తర్వాత డిండి-ఏదుల లింక్‌కు సంబంధించిన పనులకు సెంట్రల్ డిజైన్స్ ఆమోదం కూడా లభించింది. ఈనెల 3వ తేదీన జరిగిన క్యాబినెట్ సమావేశంలో డిండి-ఏదుల లైన్ డిజైన్లకు ఆమోదం తెలపడంతో పాటు, రూ.1800.60 కోట్లతో పనులు చేపట్టాలనే ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదనలను క్యాబినెట్ ఆమోదించింది. క్యాబినెట్ ఆమోదం మేరకు బుధవారం ఇరిగేషన్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిండి-ఏదుల లింక్ పనులకు రూ.1800.60 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. దీంతో ఇరిగేషన్‌శాఖ టెండర్లు ఆహ్వానించే ప్రక్రియ ప్రారంభించనుంది.

హెడ్‌వర్క్స్ స్వరూపమిదే

డిండి-ఏదుల లింక్‌లో ప్రధానంగా ఏదుల రిజర్వాయర్ నుంచి 800 మీటర్ల అప్రోచ్ ఛానల్ తవ్వుతారు. 2.525 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్, 9మీటర్ల డయాతో 16 కిలోమీటర్ల టన్నెల్ తవ్వుతారు. ఆ తరువాత 3.050కిలోమీటర్ల ఓపెన్‌కెనాల్ నిర్మిస్తారు. మొత్తం 21.575కిలోమీటర్ల తర్వాత నీరు దుందుభి నదిలోకి వెళ్తుంది. అక్కడి నుంచి 6.325కిలోమీటర్ల తర్వాత ఉన్న పోతిరెడ్డిపాడు చెక్‌డ్యామ్‌కు 1.500 కిలోమీటర్ల దిగువన ఉల్పర వద్ద బ్యారేజీని నిర్మిస్తారు. అయితే పోతిరెడ్డిపాడు వద్ద చెక్‌డ్యామ్ స్థానంలో రబ్బర్‌డ్యామ్ నిర్మిస్తారు.

ఎరువు ఎక్కువైంది..

● చీడపీడల నివారణకు పెద్దఎత్తున వాడకం ● కూరగాయల సాగులోనూ అదే తీరు ● సేంద్రియ ఎరువుల వాడకం అంతంతే



భువనగిరి అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పంటలకు రసాయన ఎరువుల వాడకం పెరుగుతోంది. నత్రజని, యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువులు పొలంలో చల్లితే పైరు ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందనే ఆపోహతో దీని వాడకం పెరిగింది. ఐదేళ్లల్లో (2020 నుంచి 2024 సంవత్సరం) వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి యాదాద్రిభువనగిరి జిల్లాలో సుమారు 6,23,625 మెట్రిక్ టన్నుల ఎరువులు వాడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. రెండు పంటలకు కలిపి ఏటా సు మారు 1.50లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులు వరి పొలాల్లో చల్లారు. దీంతో భూసారం తగ్గడంతో పాటు ఎరువుల కొను గోలుకు రైతులకు పెట్టుబడి అధిక భారమవుతోంది. పర్యావరణానికి కూడా హాని కలిగి భూసారం దెబ్బతింటుంది. వీటి వాడకాన్ని తగ్గించ కుంటే పర్యావరణానికి ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ హితం కోసం ప్రత్యేకంగా వ్యవసాయ పాలసీ అంటూ ఏదీ లేకపోవడంతో ఎరువుల వాడకం అదుపులో లేదు.

సగటున ఎరువుల వినియోగం

దేశ వ్యాప్తంగా ఎకరానికి సగటున 53.9కిలోల ఎరువులు వినియోగిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎకరానికి 177కిలోల ఎరువులు వాడుతున్నారు. అన్నదాతలు తమ పంటలకు వేస్తున్న ఎరువుల్లో 30శాతం పంటలకు మాత్రమే ఉపయోగపడుతుండగా 70శాతం ఎరువులు భూమిలో ఇంకిపోవడం, నీళ్లలో కొట్టుకుపోతున్నాయి. ఈ ప్రక్రియ ద్వారా మట్టి, నీళ్ల కలుషితమవుతూ భూగర్భ జలాలు విషతుల్యమవుతున్నాయి.

ఏటేటా పెరుగుతున్న క్రిమిసంహారక మందుల వాడకం

జిల్లావ్యాప్తంగా చీడపీడల నివారణకు పెద్దఎత్తున క్రిమిసంహారక మందులు వాడకం ఏటేటా పెరుగుతోంది. ఎక్కువ మోతాదులో క్రిమిసంహారక మందుల వినియోగంతో భూసారం దెబ్బతినడమే కాక పర్యావరణానికి, భూగర్భజలం విషతుల్యమై ప్రమాదకరంగా మారుతోంది. అవగాహన లోపమో..! పంట దిగుబడి అధికంగా వస్తోందనే భావనో..! కానీ రైతులు పంట పొలాల్లో ఎక్కువ సేంద్రియ ఎరువుల వాడాలంటే వాటి తయారీకి ఎక్కువ సమయం పడుతున్నందున క్రిమిసంహారక మందులు, ఎరువులు వాడేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

70శాతం ఎరువులు వృథా

క్యానర్ ముప్పు ఉన్నందున ప్రపంచ వ్యాప్తంగా నిషేదం విధించిన గ్లైఫోసేట్ మందును ఇక్కడ వినియోగంలో ఉంది. మోతాదుకు మించి 70శాతం ఎరువులు ఎక్కువ వాడడంతో కలుషితం ఏర్పడుతోంది. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయాలని ఎంతగా చైతన్యపర్చినా.. ప్రోత్సహించిన రైతులు మొగ్గు చూపకపోవడంతో వ్యవసాయశాఖ అధికారుల ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. అన్ని రకాల పంటలకు అధికంగా ఎరువుల వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు తప్పదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

యాదాద్రి జిల్లాలో 2020 నుంచి పంటలకు వినియోగించిన ఎరువులు మెట్రిక్ టన్నుల్లో

ఎరువులు	2020		2021		2022		2023		2024	
	వానాకాలం	యాసంగి	వానాకాలం	యాసంగి	వానాకాలం	యాసంగి	వానాకాలం	యాసంగి	వానాకాలం	యాసంగి
యూరియా	28,792	15,894	33,898	20,388	36,530	20,126	35,635	20,126	35,260	25,282
డీఏపీ	12,670	6,550	13,969	8,401	15,054	8,294	14,684	8,294	14,530	10,419
ఎంవోపీ	4,963	2,620	5,588	3,360	6,021	3,318	5,874	3,318	5,812	4,167
ఎస్ఎస్‌పీ	1,490	803	1,676	1,030	1,806	1,017	1,762	1,017	1,744	1,278
కాంప్లెక్స్	19,854	10,480	22,350	13,442	24,086	13,270	23,495	13,270	23,248	16,670
మొత్తం	67,769	36,347	77,481	46,621	83,497	46,025	81,450	46,025	80,594	57,816

కాలుష్య నివారణకు సేంద్రియ ఎరువులు వాడాలి



కాలుష్య నివారణకు సేంద్రియ ఎరువులనే వాడాలి. దీనివల్ల భూమిలో సేంద్రియ కర్బణ శాతం అధికమై దిగుబడులు పెరుగుతాయి. విచ్చలవిడిగా ఎరువుల వాడకం వల్ల రకరకాల వ్యాధులు వస్తాయి. పాలు కలుషితం, రక్తంలో పురుగు మందుల అవశేషాలు కూడా ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. భూమిని పరీక్షించిన తర్వాత జీవ సంబంధ ఎరువులు పశువుల వ్యర్థ నిల్వలు, వానాపాములతో ఆరోగ్యకరమైన సేంద్రియ ఎరువులు వాడాలి.

● బి. అనిల్‌కుమార్, ఏరువాక శాస్త్రవేత్త, యాదాద్రి భువనగిరి

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



జిల్లాలో భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నాం. పశువుల, గొర్రెల ఎరువుతో పాటు వర్మీకంపోస్టు, జీవన ఎరువులతో భూసారం పుష్కలంగా పెరిగిపోతోంది. కాలుష్యం తగ్గి అధిక దిగుబడులు వచ్చే అవకాశాలున్నాయి. సే ంద్రియ ఎరువులతో పండ్లు, కూరగాయల తోటలకు కూడా ప్రయోజనం చేకూరుతోంది. వర్షాలు కురిసిన తర్వాత పుష్కలంగా నత్రజని ఉత్పత్తి చేసే పచ్చిరొట్ట, జనుము విత్తనాలు చల్లుకోవాలి.

● కే. గోపాల్, యాదాద్రి భువనగిరి, జిల్లా వ్యవసాయ అధికారి

సేంద్రియ ఎరువులే వాడాలి

సేంద్రియ(ఆర్గానిక్) సేద్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పరం పరాగత్ కృషి వికాస్ యోజన(పీకేవీవై) పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదు. సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి భారం తగ్గడంతో పాటు భూమి సారవంతంగా మారుతోంది. పంట పొలాల్లో సూక్ష్మధాతు లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న జింక్, బోరాన్, మాంగనీస్ వంటివి వాడితే మేలు జరుగుతోంది. పంటలకు బలాన్ని ఇచ్చి భూసారం పెంచేందుకు పిల్లిపెసర, జీలుగ, జనుము, పచ్చిరొట్ట విత్తనాలు చల్లి ఏపుగా పెరిగిన తర్వాత కలియ దున్నితే యూరియా అవసరం లేకుండా కావాల్సినంత నత్రజని పోషకం లభిస్తుంది.

యాదాద్రి జిల్లాలో వరి సాగు ఇలా..

	వానాకాలం	యాసంగి
2020	2,02,343.42	2,40,030.11
2021	2,79,995.10	1,65,743.31
2022	2,79,995.10	2,90,873.11
2023	3,05,691.13	2,93,292.14
2024	2,87,432.18	నమోదు కాలేదు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కోదాడటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో గురువారం జరిగిన కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడారు. నూతన కమిటీ సూర్యాపేట, మిర్యాలగూడ, ఖమ్మం, ఏపీలోని జగ్గయ్యపేట మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల సంక్షేమం కోసం పని చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

కోదాడ మార్కెట్ అభివృద్ధికి సహకరిస్తా : మంత్రి తుమ్మల

కోదాడ మార్కెట్ అభివృద్ధికి సహకరిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భవిష్యత్తులో గోదావరి జలాలు పాలేరు ద్వారా కోదాడకు తరలించేందుకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల వద్దకు పాలన తెచ్చి ప్రజల మధ్యనే లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించేందుకు ప్రజాపాలన, గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబితాలో పేరు లేకపోతే పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైతులకు పెద్దపీట వేస్తున్న ప్రజాప్రభుత్వం

భువనగిరి రూరల్: ప్రజాప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసి సంవత్సరంలో రూ. 54వేల కోట్ల లబ్ధి చేకూర్చిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మార్కెట్ కమిటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తున్న ఎమ్మెల్యేలు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ఈ రెండు నియోజకవర్గాలను అభివృద్ధి చేసే బాధ్యత తనదేనన్నారు. గత ప్రభుత్వం చేయని రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి తన భుజాలపై వేసుకుని ఏక కాలంలో రూ.21వేల కోట్లు మాఫీ చేశామన్నారు. రైతులు పండించిన సన్న ధాన్యానికి రూ.1100 కోట్ల బోనస్ అందచేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికి రైతులను, నేతన్నలను మరవవద్దని సీఎం పేర్కొన్నట్లు తెలిపారు. అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నాయకులు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడుతున్నారన్నారు. భువనగిరి, ఆలేరు ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు రూ.2లక్షల రుణమాఫీ చేశామన్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తే వడ్డీ కిందికే పోయేదన్నారు. ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కనుకుంట్ల రేఖ బాబురావు, వైస్ చైర్మన్ బైస్ రాజేశ్ పైలెట్, డైరెక్టర్లతో జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎండీ. అవేస్ చిస్తీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, బర్రె జహంగీర్, గోళి పింగల్‌రెడ్డి, తడక వెంకటేశ్, కూర వెంకటేశ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, పి. శ్యాంగౌడ్, ఆర్డీవో ఎం. కృష్ణారెడ్డి, జడ్పీ సీఈవో ఎన్. శోభారాణి, డీఏవో గోపాల్ పాల్గొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హాజరవుతున్న ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు యత్నిస్తున్నారనే నేపథ్యంలో ముందస్తుగా స్థానిక బీఆర్‌ఎస్ నేతలను అరెస్టు చేశారు.

రైతన్న, నేతన్నలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

వలిగొండ: రైతులు, చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలో వలిగొండ వ్యవసాయ మార్కెట్ కేంద్ర కార్యాలయం, రామన్నపేట నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. రైతులు పండించిన ధాన్యానికి మూడు రోజుల్లో వారి ఖాతాలో డబ్బులు జమ వేసినట్లు తెలిపారు. జనవరి 26న రైతు భరోసా కింద ఎకరానికి రూ.6వేలు జమ చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు షురూ

● దీపారధనతో ప్రారంభించిన దర్గా ముజావర్ ● వేలాదిగా తరలిస్తున్న భక్తులు ● నిరంతరాయంగా బస్సులు నడపనున్న ఆర్టీసీ ● భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు


బాబా సమాధుల వద్ద పూలు చల్లుతున్న భక్తులు

పాలకవీడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం ప్రారంభమైంది. తెల్లవారుజామున సైదులు స్వామిని మొదటి రోజు ముస్తాబు చేసి పెళ్లికొడుకుల అలంకరించారు. కొవొత్తుల హారతుల మధ్య దర్గాలోని హజ్రత్ సయ్యద్ మోహినుద్దీన్‌షా, జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపై దర్గా ముజవర్లు గంధం ఎక్కించి ప్రార్థనలు ప్రారంభించారు. దర్గా వద్ద నాగేంద్రుని పుట్టకు మహిళలు పూజలు నిర్వహించారు. దర్గా ముజావర్ జాని కుటుంబసభ్యులు దర్గాలోని రెండు సమాధులపై హైదరాబాద్ నుంచి తెప్పించిన పువ్వులు, ప్ర త్యేక దట్టీలతో అలంకరించారు. సైదులు బాబాకు అంగరక్షకుడిగా ఉన్న సిపాయి బాబా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిపాయి దేవుడికి పూజలు నిర్వహించిన తర్వాతే సైదులు బాబాకు పూజలు చేయడం ఆనవాయితీ, ఉదయం ఖవ్వాలీ నిర్వహించారు. మతాలకు అతీతంగా దర్గా వద్ద ఉన్న నాగేంద్రుడి పుట్టకు మహిళలు పూజలు నిర్వహించారు.

ఉర్సులో వెలిసిన దుకాణాలు

ఉర్సులో తినుబండారాలు, వివిధ రకాల స్టాళ్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గిరిజనతండాలు ఉర్సుకోసం బంధువులను పిలుచుకొని కందూరు చేసుకుంటున్నారు. మెడికల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, ఆర్టీసీలు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. కోదాడ నుంచి నేరేడుచర్ల మీదుగా ప్రత్యేక బస్సులు, మిర్యాలగూడ డిపో నుంచి దామరచర్ల, నేరేడుచర్ల మీదుగా ఆర్టీసీ బస్సులు నిరంతరాయంగా నడుపుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కావడంతో భక్తులు సంఖ్య పెరిగే అవకాశముందని బస్సుల సంఖ్య పెంచాలని భక్తులు కోరుతున్నారు. భక్తుల ఇబ్బందులు జరగకుండా 550 మంది పోలీసులతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. దర్గా పరిసరాల్లో మూడు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

తాగునీటి సరఫరా



నిరంతరాయంగా తాగునీటిని అందించేందుకు డెక్కన్ సిమెంట్ యాజమాన్యం ముందుకు వచ్చింది. ఎనిమిది ట్రాక్టర్ ట్యాంకర్లతో నిరంతరం నీటి సరఫరా చేస్తున్నారు. దర్గా పరిసరాలలో దుమ్ము లేవకుండా రహదారులపై నిరంతరం నీటిని చల్లుతున్నారు. దర్గా పరిసర ప్రాంతంలో రూ.5 లక్షలతో సోలార్ లైట్లు, రూ.5 లక్షలతో శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

నేడు గంధం ఊరేగింపు

వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తెచ్చిన గంధాన్ని ముజవర్లు దర్గా వద్ద ఉన్న చందల్‌ఖానాలో ఉంచుతారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంతో శుక్రవారం ఉదయం 9గంటలకు చందల్‌ఖానా నుంచి ఊరేగింపుగా బయలు దేరుతుంది. సమీపంలోని కల్మెటతండా, జాన్‌పహాడ్, చెర్వు తండా గ్రామాల వరకు ఊరేగిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు గంధాన్ని జాన్‌పహాడ్ దర్గా వద్దకు తీసుకొచ్చి హజ్రత్‌సయ్యద్ మోహినుద్దీన్‌షా, జాన్‌పాక్ షహీద్ రహమతుల్లా సమాధులపైకి ఎక్కిస్తారు. గురువారం అర్ధరాత్రి నుంచే వేలాది మంది భక్తులు దర్గా వద్దకు చేరుకుని గంధం ఊరేగింపులో పాల్గొంటారు. ఆ సమయంలో తొక్కిసలాట జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తారు.


దర్గా వద్దకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నేడు జాన్‌పహాడ్ దర్గాకు మంత్రి ఉత్తమ్

ఉర్సు గంధం మహోత్సవానికి నీటిపారుదల శాఖా మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారని మండల కాంగ్రెస్ నాయకుడు సుబ్బారావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.


దర్గాలోపల ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మరణిస్తూ.. మరొకరికి వెలుగులు

● వృద్ధుడి అవయవాలు దానం చేసిన కుటుంబసభ్యులు

కట్టంగూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తాను చనిపోతూ ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాడో వృద్ధుడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయలైన వృద్ధుడు బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు అవయవాలు దానం చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధిలోని మాణిక్యాలమ్మ గూడేనికి చెందిన బంటు అంజయ్య(62) ఈ నెల 14న ఉదయం సైకిల్‌పై వ్యవసాయబావి వద్దకు బయలుదేరాడు. నార్కట్‌పల్లి వైపునుంచి కట్టంగూరు వైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు మాణిక్యాలమ్మగూడెం వద్దకు రాగానే సైకిల్‌పై వెళ్తున్న అంజయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయలైన అంజయ్యను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు డాక్టర్లు గుండె, కిడ్నీలు సేకరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కేతేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని కేతేపల్లి ఏవో బి.పురుషోత్తం సూచించారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి కొనుగోలు, వారసత్వం, ఫౌతి, గిఫ్ట్ డీడ్ ద్వారా భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు దరఖాస్తు చేయాలన్నారు. దీనికి ఎలాంటి గడువు లేదని ఆయన చెప్పారు. గతంలో రైతుబంధు పొందిన రైతులు తిరిగి రైతుభరోసాకు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. గతంలో రైతుబంధు పొందిన రైతులకు యథావిధిగా ఈ నెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం అందించే రైతు భరోసా సాయం అందుతుందని తెలిపారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

● పన్నాల గోపాల్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో భాగంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరుతూ గురువారం నార్కట్‌పల్లి మండలంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం కమిటీని వేసినా నేటికి పరిష్కరించలేదని అన్నారు. ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసును పెంచే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట సాగర్, మురళి ఉన్నారు.

పద్నాలుగేళ్లుగా..


ఇనుపాముల బస్‌స్టేజీ వద్ద తొలగించిన పురాతన శివాలయం (ఫైల్ ఫొటో)

- కుదరని ఏకాభిప్రాయం ● నిధులున్నా నిష్ఫలం
- నిర్మాణానికి నోచుకోని శివాలయం
- కేతేపల్లి పచ్చల పార్వతీ సోమేశ్వరాలయ పరిస్థితి

కేతేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామం లో నూతన శివాలయ నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆలయాన్ని ఎక్కడ నిర్మించాలనే విషయమై గ్రామస్థుల్లో ఏకాభిప్రాయం రాకపోవడంతో పురాతన ఆలయాన్ని తొలగించి దశాబ్ద కాలం పూర్తయిన తర్వాత రెండేళ్ల క్రితం తొలి అడుగుపడినా నూతన ఆలయ నిర్మాణానికి పునాది రాయి మాత్రం పడటం లేదు. వివరాల్లోకి వెళితే... నాటి తొమ్మిదో నెంబరు జాతీయ రహదారి (ప్రస్తుతం 65వ నెంబరు) విస్తరణ పనుల్లో భాగంగా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల బస్‌స్టేజీ వద్ద గల కాకతీయుల కాలం నాటి ప్రాచీన శ్రీ పచ్చల పార్వతీ సోమేశ్వరాలయాన్ని అధికారులు తొలగించారు. ఈ దేవాలయం ఎంతో మహిమ ఉన్న ఆలయమని, రోడ్డు నిర్మాణ అలైన్‌మెంట్ మార్చి ఆలయాన్ని తొలగించకుండా చూడాలని కోరుతూ అప్పట్లో గ్రామస్థులు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నారు. అధికారులు ఎంతకూ వినకపోవడంతో జాతీయ రహదారి స్తంభించేలా ధర్నాలు, రాస్తారోకో కూడా నిర్వహించారు. ఖరారైన హైవే విస్తరణ అలైన్‌మెం ట్ మార్చడం కుదరదని అధికారులు గత 2010లో ఆలయాన్ని నేలమట్టం చేశారు. ఇలా తొలగింపునకు గురైన ఈ ఆలయానికి ప్రభుత్వం నష్టపరిహారంగా రూ.41 లక్షలు మంజూరు చేసింది. ఆలయ నిర్మాణానికి ఈ నిధులు ఏ మూలకూ చాలవని అదనపు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. చివరకు గత అసెంబ్లీ ఎన్నికల ముందు దేవాదాయశాఖ ఖాతాలో జమ అయిన నిధులకు తోడు స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులతో ప్రభుత్వం ఇనుపాముల మల్లన్న గుట్టపై ఆలయ నిర్మాణానికి ఏడాది క్రితం నిధులు మంజూరు చేసింది.

స్థల వివాదంతో గడిచిన దశాబ్ద కాలం

జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన పురాతన ఆలయానికి సమీపంలో తాత్కాలికంగా బాలాలయాన్ని నిర్మించిన గ్రామస్థులు శివలింగాన్ని, దేవతామూర్తులను అందు లో ప్రతిష్ఠించి పూజలు కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఏటా కన్నుల పండవగా నిర్వహించే మహాశివరాత్రి వేడుకలను సైతం పద్నాలుగేళ్లుగా ఇక్కడే నిర్వహిస్తున్నారు. నూతన ఆలయాన్ని స్థానిక మల్లన్నగుట్ట మీద నిర్మించాలని, గుట్టపైకి రహదారి ఏర్పాటు చేయాలని అప్పటి ఆలయ పాలకవర్గం నిర్ణయించింది. ఈ మేరకు నాడు తొలగించిన పురాతన ఆలయ రాతి స్తంభాలు, దిమ్మెలు, పైకప్పు బండరాళ్లు, ఇతర శిల్ప సంపదను మల్లన్న గుట్ట వద్దకు చేర్చారు. ఇదిలా ఉంటే గ్రామానికి దూరంగా గుట్టపై ఆలయాన్ని నిర్మిస్తే ఆలయానికి, ఆలయానికి వెళ్లే భక్తులకు భద్రత ఉండదని గ్రామానికి చెందిన కొందరు గుట్టపై ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకించారు. దీనిని విభేదిస్తున్న మరోవర్గం వారు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు అనేకం గుట్టలపైనే వెలిశాయని, గుట్టపైన అయితేనే ప్రశాంత వాతావరణం ఉంటుందని అభిప్రాయపడ్డారు. జాతీయ రహదారి వెంట గల గుట్టపై ఆలయం నిర్మిస్తే మల్లన్న గుట్ట ప్రాచుర్యంలోకి రావడంతో పాటు గ్రామానికి గుర్తింపు వస్తుందని పట్టుబట్టారు. ఇలా ఇరువర్గాల వాదోపవాదాల మధ్య పద్నాలుగేళ్ల కాలం గడిచిందే తప్ప సమస్య మాత్రం కొలిక్కి రాలేదు. ఆలయం నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఎంతో విలువైన పురాతన ఆలయ రాతి స్తంభాలు, దిమ్మెలు, పైకప్పు బండరాళ్లు, ఇతర శిల్ప సంపద మల్లన్న గుట్ట వద్ద కంపచెట్లల్లో మగ్గుతోంది.

ఆలయ నిర్మాణానికి నిధులు

అసెంబ్లీ ఎన్నికల ముందు మల్లన్న గుట్టపై ఆలయం నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆలయ నిర్మాణానికి రూ.5 కోట్లు, గుట్టపై నిర్మించే ఆలయానికి వెళ్లేందుకు అవసరమైన ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు మొత్తం రూ.6.50 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసింది. దీంతో 2023 జూన్‌లో స్థానికుడైన ఓ కాంట్రాక్టర్ 65వ నెంబరు జాతీయ రహదారి నుంచి మల్లన్నగుట్టపైన ఆలయం నిర్మించే ప్రాంతం వరకు రూ.1.50 కోట్ల వ్యయంతో సీసీ ఘాట్‌రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేశారు. ఆ తర్వాత 2023 అక్టోబరులో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. ఇదే సమయంలో గుట్టపైన హోమం నిర్వహించి నాటి జిల్లా మంత్రితో ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన సైతం చేయించారు. కానీ ఆలయ నిర్మాణ పనులకు దేవదాయ శాఖ పిలిచిన టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన లేకుండాపోయింది. దీంతో ఏడాదికి పైగా ఆలయ నిర్మాణ పనుల్లో కదలికలేకుండా పోయింది. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి టెండర్లు పిలిచి ఆలయ నిర్మాణానికి చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

మరోసారి టెండర్లు ఆహ్వానిస్తాం

ఇనుపాముల శ్రీ పచ్చల పార్వతీసోమేశ్వరాలయ నిర్మాణానికి గతంలో వేసిన టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. టెండర్లు వేయలేదు. ఈ పనులకు మరోసారి టెండర్లు ఆహ్వానించి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

● భాస్కర్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

టెండర్లు వేయడంలో తాత్సారం తగదు



గతంలో వేసిన టెండర్లలో కాంట్రాక్టర్లు పాల్గొనకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కొత్తగా వచ్చిన వారు ఆలయ నిర్మాణంపై శ్రద్ధ పెట్టి మరోసారి టెండర్లు పిలిచేలా చూడాల్సిన అవసరం ఉంది. టెండర్లు పిలవకపోవడంతో మంజూరైన నిధులు వినియోగంలోకి రాకుండాపోయాయి.

● కొనుగు యాదగిరి, ఆలయ మాజీ చైర్మన్, ఇనుపాముల

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

నార్కట్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటంలో కొన్నాళ్లుగా విద్యుత్ స్తంభాల కొరతతో గ్రామస్థులు పడుతున్న సమస్యలకు పరిష్కారం లభించింది. గ్రామంలో పలు కాలనీల్లో ఎప్పుడో సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలమై ప్రమాదరకంగా మారాయి. దీంతో కొత్తగా ఏర్పడిన కాలనీకి విద్యుత్ స్తంభాలు లేక దూరంగా ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి కనెక్షన్ తీసుకోవడం, లూజు లైన్లు సమస్యలతో గ్రామస్థులు కొన్నాళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామానికి చెందిన నార్కట్‌పల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి నర్సింహారెడ్డి, చెర్వుగట్టు మాజీ డైరెక్టర్ గడ్డం పశుపతి తదితర కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి 20 విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించగా గురువారం వాటిని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కట్టంగూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ అన్నారు. మండలంలోని మునుకుంట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం 4వ తరగతి విద్యార్థులకు గురుకుల ఎంట్రెన్స్ పరీక్ష స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు వసంతకుమారి, ఎల్లాచారి, లవకుమార్ పాల్గొన్నారు.

పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలి


గుడివాడలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఆర్పీ మల్లయ్య

కేతేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని తల్లి దండ్రులు తమ బడి ఈడు పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలని కేతేపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.నర్సిరెడ్డి కోరారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కొర్లపహాడ్, గుడివాడ, కేతేపల్లి గ్రామాల్లో సీఆర్పీలు, ఆయా గ్రామాల పీఎస్, జడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గుర్తించిన బడి బయటి పిల్లల ఇళ్లకు వెళ్లిన ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి పిల్లలను పాఠశాలకు పంపించకుండా పనిలో పెడితే ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు.

మల్లయ్య హత్య పిరికిపందల చర్య: కాంగ్రెస్


మల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాలిగౌరారం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉప్పలంచ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్యను రాజకీయంగా ఎదుర్కోలేకే పిరికి హత్య చేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండల కందాల సమరంరెడ్డి, పార్టీ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్లయ్య హత్యకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లయ్య అకాల మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటన్నారు. మల్లయ్య కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సీఎం రెడ్డి, నాయకులు బండపెల్లి కొమరయ్యగౌడ్, గూని వెంకటయ్య, చింత ధనుంజయ్, వడ్లకొండ పరమేష్, బెల్లి వీరభద్రం, భూపాతి అంజయ్య, వేముల గోపినాథ్, బొల్లికొండ గణేష్, తోటకూరి పరశురాములు, జమ్ము అశోక్, వేముల సాయికుమార్, కంది మహేష్, కిరణ్, వేముల శ్రీకాంత్, సందీప్, శ్రీను పాల్గొన్నారు.

నేడు సీజీఆర్ఎస్ సమావేశం

నల్లగొండటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలపై శుక్రవారం సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ గ్రీవెన్సెస్ (సీజీఆర్ఎఫ్) నిర్వహించనున్నట్లు ఎస్ఈ వెంకటేశ్వర్లు ఒకప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారానికి ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు రశీదుతో హాజరుకావాలని ఆయన కోరారు.

ఎన్నికల హామీలను నెరవేర్చనున్న ప్రభుత్వం

మునుగోడురూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతుందని ఆ పార్టీ నాయకులు వెదిరె మేఘారెడ్డి, వెదిరె విజేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జనవరి 26వ తేదీన అమలుకు శ్రీకారం చుట్టిందని కొంపల్లి గ్రామంలో ఉన్న అర్హత గల ప్రతి ఒక్కరూ శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే గ్రామ సభలో పాల్గొనాలని వారు కోరారు.

కృష్ణమూర్తి వర్మ మృతి బాధాకరం

గట్టుప్పల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిరంతరం పేద ప్రజల కోసం పనిచేసే సి పురోహితులుగా గొప్ప సేవలందించిన మాడ కృష్ణమూర్తిశర్మ మృతి చెంద డం బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి అన్నారు. గట్టుప్పల మండల కేంద్రంలో గురువారం ఆయన చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాళర్పించి మాట్లాడారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మారగోని అంజయ్యగౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, పాల్వాయి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కుక్కలదాడిలో 9 గొర్రె పిల్లలు మృతి

నాంపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 9 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మట్టిపల్లి యాదయ్యకు చెందిన 9 గొర్రె పిల్లలను కుక్కలు దాడి చేసి గాయపరచడంతో మృతి చెందాయి. గొర్రె పిల్లల విలువ రూ.70వేల వరకు ఉంటుందని యాదయ్య వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

● ఎమ్మెల్యే వేముల వీరేశం


కట్టంగూరు: అయిటిపాముల గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, నకిరేకల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరు, నకిరేకల్ మండలాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద లబ్ధి పొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత గ్రామ సభల్లో చదివి వినిపించిన పేర్లు ముసాయిదా జాబితా మాత్రమేనని, ఇందులో అనర్హులు ఉంటే వారి పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందని అన్నారు.

● కట్టంగూరు మండలంలోని అయిటిపాముల, మల్లారం, పరడ, ముత్యాలమ్మగూడెం, పామనగుండ్ల, చెర్వుఅన్నారం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాను చదివి ప్రజలకు వినిపించారు. ఆయా కారక్రమాల్లో మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఏవో గిరిప్రసాద్, ఎంఈవో అంజయ్య, డీటీ సుకన్య, ఎంపీవో చలపతి, ఆర్ఐ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలోని 15, 20 వార్డుల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో నకిరేకల్ మునిసిపల్ చైర్మన్ చెవుగోని రజితశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, మునిసిపల్ కమిషనర్ బాలయ్య, కౌన్సిలర్లు యాసారపు వెంకన్న, గాజుల సుకన్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

● చిట్యాలలో మునిసిపాలిటీలో జరిగిన వార్డు సభల్లో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం దశలవారీగా ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, సిలివేరు మౌనికశేఖర్, గోధుమగడ్డ పద్మజలంధర్‌రెడ్డి, రెమిడాల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాముల, కొత్తపేట, బొప్పారం, చెరుకుపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఇనుపాములలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. సర్వేల్లో పేర్లు రాని పలువురి నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఆయా గ్రామసభల్లో మండల ప్రత్యేక అధికారి జి.హరీష్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఏవో పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, ఆర్ఐ చాంద్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లి మండలంలోని దామెర, తుంగపాడు, నామనాయక్ తండా, రెవెల్లి, చల్లవానికుంట, పకీర్‌పురం, జాన్‌తండా, తిరుమలగిరి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ దేవసింగ్ పాల్గొని మాట్లాడారు. సమావేశాల్లో ఎంపీడీవో స్వర్ణమేరికుమారి, ఎంపీవో ఝాన్సీరెడ్డి, ఏఈలు రామచంద్రయ్య, ఉదయసాయిరెడ్డి, శివకుమార్, ఆర్ఐ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ కొట్టాల, అజలాపురం, కొండూరు, ఖుదాభక్ష్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ పథకాలపై లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ పథకాల అమలులో అర్హులైన వారికి తమకు పథకాలు అందలేదని ప్రజలు అధికారులను ప్రశ్నించడంతో తలలు పట్టుకుంటున్నారు. పథకాల కోసం దరఖాస్తులు పెట్టుకున్న నిరుపేదలకు లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవని, అనర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారని అధికారులను నిలదీస్తున్నారు. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపికలో ఉద్యోగస్థులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో మున్నయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయక్, యూసుఫ్, మాజీ జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


చిట్యాల: సభలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

నేతాజీ అడుగుజాడల్లో పయనించాలి


కేతేపల్లి: రాయపురంలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు సుందర్

చిట్యాల, శాలిగౌరారం, కేతేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యంలో కీలక భూమిక పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో పయనించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువా రం జిల్లాలోని చిట్యాల, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నేతాజీ ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు.

● చిట్యాలలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు గుండెబోయిన సైదులు, అధ్యక్షుడు శిరబోయిన కృష్ణ, గుండెబోయిన శ్రీనివాస్, నామని శ్రీనివాస్, కొత్తపల్లి నర్సింహ, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండల కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్లు దొంతూరి పరమేష్, పరమేష్‌గౌడ్, ప్రిన్సిపాల్ ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొజ్జ సుందర్, సంఘం సభ్యులు, స్థానిక యువకులు పాల్గొని నివాళులర్పించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నల్లగొండరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చే యాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో సీపీఎం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాల ని కోరుతూ గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం రాజీలేని పోరాటాలు చేస్తుందని అన్నారు. రాష్ట్ర మహాసభలో అనేక ప్రజా సమస్యలపై చర్చించి దిశా, నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. కారంపూరి రాము అధ్యక్షత న జరిగిన సమావేశంలో నాయకులు సయ్యద్ హాశం, దండెంపల్లి సత్తయ్య, ఎండి సలీం, తుమ్మల పద్మ, పరిపూర్ణచారి, అశోక్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

నల్లగొండటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళ ఆరోగ్య వికాస తరంగిణి సెంట్రల్ కోఆర్డినేటర్ కె.మాధవిరవీంద్ర అన్నారు. పట్టణంలోని యాదవ సంఘం భవన్‌లో అధర్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మహిళా ఆరోగ్య వికాస తరంగిణి, పెరుమాళ్ల ఆసుపత్రి, దేవి దంత వైద్యశాల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా మహిళల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధర్వ ఫౌండేషన్ చైర్మన్ గుత్తికొండ సువర్ణ హేమచంద్రరావు, డాక్టర్లు వరుణ్ కుమార్, సోంబాబు, సయ్యద్ తాజుద్దీన్, సృజన్, సేవాభారతి నల్లగొండ శాఖ సభ్యులు శ్రీకాంత్, వికాస తరంగణి సుజాత పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నాంపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగపాడు గ్రామానికి చెందిన నేతాళ్ల లింగయ్య వారం రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ కడారి శ్రీశైలం యాదవ్ గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండిగ చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ పచ్చిపాల ఆంజనేయులు, నాయకులు మేకల దేవేందర్, బుడిగ బుచ్చయ్య, దండిగ నరేష్, నేతాళ్ల యాదగిరి, నర్సింహ, నరేష్, సురేష్, శివ, మేకల యాదగిరి, మహేష్, పులకరం ఆంజనేయులు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

నాంపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టిపల్లిలో జడ్పీ హైస్కూల్‌లో గురువారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తనతో పాటు చదువుకునే విద్యార్థులకు విద్యా బోధన చేశారు. కలెక్టర్‌గా రాణి, డీఈవోగా వసుంధర విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రమాదేవి, సుధాకర్‌రెడ్డి, కృష్ణాచారి, వీరయ్య, రాజేశ్వరి, దామోదరచారి, విష్ణు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మధులాష్‌బాబు

మునుగోడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని రాణించాలని కలాం స్ఫూర్తి యాత్ర ఫౌండర్ మధులాష్ బాబు అన్నారు. మునుగోడు హైస్కూల్‌లో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో నిర్వహించిన కలాం స్ఫూర్తి యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్లో బస్సు ద్వారా రోబోటిక్స్ 3డీ ప్రింటింగ్, ఏఆర్, వీఆర్, ఎంఎల్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల భవిష్యత్తు మనుగడకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అందుకోసం ఆ పరిజ్ఞానంపై అవగాహన ఉండాలని విద్యార్థులకు సూచించారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యాత్ర బృందం సభ్యుడు గుర్రం నరేష్, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



డిండి-ఏదుల లింక్‌కు త్వరలో టెండర్లు

- రూ.1800.62కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు
- మార్చిలోపు టెండర్లు ఖరారుచేసే అవకాశం
- డిండి ప్రాజెక్టుతో నల్లగొండ జిల్లా సస్యశ్యామలం
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాలకు సాగునీరందించే డిండి ఎత్తిపోతల పథకానికి త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పథకంలో కీలకమైన డిండి-ఏదుల లింక్‌కు సంబంధించిన పనులను రూ.1800.60కోట్లతో చేపట్టేందుకు రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించిన తుది డిజైన్లను ఖరారు చేసిన వెంటనే టెండర్లను ఆహ్వానించాలని ఇటీవల నిర్వహించిన క్యాబినెట్‌లో నిర్ణయించిన నేపథ్యంలో త్వరలో టెండర్ల ప్రక్రియ మొదలవనుంది. మార్చిలోపే టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఇరిగేషన్ అధికారులకు సూచించింది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

డిండి-ఏదుల లింక్ పనులతో పాటు, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రధాన కాల్వ, రిజర్వాయర్ల నిర్మాణ పనులను రానున్న మూడేళ్లలో పూర్తిచేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగు, తాగునీరందించే ఈ పథకానికి ఉన్న ఆటంకాలు ఒక్కోటిగా తొలగిపోతున్నాయి. ఈ ప్రాజెక్టుకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచే అర టీఎంసీ నీటిని తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినా, గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ నుంచి తరలించాలనే విషయాన్ని తేల్చలేకపోయారు. అయితే దిగువన రిజర్వాయర్ల, ప్రధాన కాల్వ నిర్మాణ పనులు మాత్రం గత ప్రభుత్వం కొనసాగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా దృష్టిసారించి ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని సేకరించాలని నిర్ణయించింది. రోజుకు అర టీఎంసీ

మిగతా 7వ పేజీలో...

బీఆర్‌ఎస్ పాలనలో పడావుపడ్డ ప్రాజెక్టులను పూర్తిచేస్తాం



ఉమ్మడి జిల్లాలో ఫ్లోరైడ్ పీడ విరగడ చేసేందుకు కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పడావు పెట్టింది. మేం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తిచేయిస్తున్నాం. అధికారంపోయిందనే బాధతో కుటిల రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాలు పదేళ్లుగా జిల్లా ప్రాజెక్టులను ఎందుకు నిర్లక్ష్యం చేశాయో ప్రజలకు సమాధానం చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు నల్లగొండ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసినవారు, ఇప్పుడు అధికారం లేకపోవడంతో జిల్లాపై పడుతున్నారు. జిల్లాలో కరువును శాశ్వతంగా పారదోలే డిండి ఎత్తిపోతల పథకానికి రూ.6,190కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజల తరఫున కృతజ్ఞతలు. వచ్చే మూడేళ్లలో ఈ పథకాన్ని పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. డిండి, సింగరాజుపల్లి, గోకారం, గొట్టిముక్కల, ఇర్విన్, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లను కృష్ణాజలాలతో నింపి ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం. దశాబ్దాల ఫ్లోరైడ్ పీడను విరగడ చేస్తాం. దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న జిల్లాను అన్ని రంగాల్లో ప్రజా ప్రభుత్వ హయంలో అభివృద్ధి చేస్తాం.

● కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి

నిల్వలపై నిఘా

- ఎరువుల కొరత సృష్టించకుండా వ్యవసాయశాఖ చర్యలు
- దుకాణాలపై నిరంతరం పర్యవేక్షణ, తనిఖీలకు బృందాల ఏర్పాటు



యాదాద్రి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎరువుల దుకాణాల్లో తనిఖీలకు వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. జిల్లా వ్యవసాయ అధికారి వారంలో ఐదు దుకాణాలు, ఏడీఏలు 10 దుకాణాలు, ఏవోలు 10 దుకాణాల్లో తనిఖీలు చేపట్టి, స్టాక్ వివరాలు పరిశీలిస్తున్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం రూపొందించిన ఫర్టి ఇన్వెంటరీ వెరిఫికేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో దుకాణాల యజమానులు వారి రిజిస్టర్లలో ఎరువుల స్టాక్ వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా? దిగుమతి, విక్రయం మధ్య ఏమైనా తేడా ఉందా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. యాసంగి సీజన్ సాగు పనులు ముమ్మరం అయిన నేపథ్యంలో ఎరువుల విక్రయాలు ఊపందుకున్నాయి. రైతులకు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించేందుకు, సకాలంలో సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. వ్యవసాయ అధికారుల బృందం జిల్లాలో ఉన్న ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీచేసి, ఎరువుల విక్రయాలను పరిశీలించనుంది. ఈ మేరకు జిల్లాలోని డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలను సేకరిస్తున్నారు. డీలర్ల వద్ద ఉన్న పాత నిల్వలను అదే ధరలకు రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డీలర్ల వద్ద మిగిలిన ఎరువులను పాత ధరలకే విక్రయించాలని, కొత్త ధరలకు విక్రయించవద్దని స్పష్టంచేశారు. ఎరువుల కొనుగోళ్లు, స్టాక్, ధరల అంశాలను పరిశీలించేందుకు, కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. డీలర్ల వద్ద స్టాక్ ఉన్నంత వరకు ఎరువులను రైతులకు విక్రయించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

అందుబాటులో ఎరువులు

యాసంగిలో సాగుచేసే రైతులకు విత్తనాలు, ఎరువులను దుకాణాల్లో రైతులకు

మిగతా 6వ పేజీలో..

అర్హులకు సంక్షేమ పథకాలు

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్



పెద్దకాపర్తిలో మాట్లాడుతున్న అనితారామచంద్రన్, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

చిట్యాలరూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మహిళా శిశుసంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దకాపర్తిలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సంక్షేమ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలకు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను పొదుపు చేసుకుని అత్యవసర సమయాల్లో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. గ్రామసభలో చదివిప జాబితాలో పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, పేరు లేకపోతే అనర్హులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గ్రామ సభలో దరఖాస్తు చేయనివారు ఎంపీడీవో కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఇది నిరంతరం ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. కాగా, మండలంలోని సుంకెనపల్లిలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. అర్హత ఉన్నా జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీశారు. అయితే పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని వారికి అధికారులు సూచించారు.

పౌష్టికాహారాన్ని సరిగా పంపిణీ చేయాలి

(ఆంధ్రజ్యోతి, చిట్యాల): చిన్న పిల్లలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి అనితారామచంద్రన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఒకటో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి తనిఖీ చేశారు. చిన్నారులతో మాట్లాడారు. ప్రీస్కూల్ సామగ్రి, పౌష్టికాహార పంపిణీపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూట్రీషియన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం యాప్‌ను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ అపర్ణ, తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



వేములపల్లి ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వేములపల్లి, తిప్పర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం వేములపల్లి, తిప్పర్తి మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. హాజరు, ఓపీ, వ్యాక్సినేషన్, గర్భిణుల నమోదు రిజిస్టర్లను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు బాధితులు పెరుగుతున్నందున పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకొని కుక్కల బెడద తగ్గేలా చూడాలన్నారు. అవసరమైన చోట స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకొని కుక్కలను సుదూర ప్రాంతాలకు లేదా సంరక్షణ కేంద్రాలకు తరలించాలన్నారు. పీహెచ్‌సీలో 24గంటల వైద్య సేవలతోపాటు కుక్క, పాము కాటు, రక్తహీనత ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నందున వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములపల్లి పీహెచ్‌సీకి కొన్ని వైద్య పరికరాలు కావాలని సిబ్బంది కోరగా, వాటికి అవసరమైన నిధులు ఆరోగ్యశ్రీ ద్వారా గానీ, తన నిధుల ద్వారా గానీ సమకూర్చుతానని హామీ ఇచ్చారు. అనంతరం వేములపల్లి మండల ప్రత్యేకాధికారిని గ్రామసభల తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, వైద్యాధికారి సుచరిత, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో శారదాదేవి, సూపర్‌వైజర్ శాంతమ్మ, సిబ్బంది గీతావాణి, శాంతి, అరుణకుమారి, దేవేందర్, నరేందర్, తిప్పర్తి తహసీల్దార్ డి.స్వప్న, తదితరులు ఉన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఓట్లు తగ్గినా, విలువ తగ్గలేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

మిర్యాలగూడ. జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఓట్లు తగ్గినా విలువ తగ్గలేదని, నిజాయతీతో పనిచేస్తున్న కమ్యూనిస్టులంటే ప్రజల్లో గౌరవం భావం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం సీపీఎం నేత గాదె శ్రీనివాసరెడ్డి విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు ఈదులగూడెం చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి రెండు పార్టీల సహాయంతో అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీ రాజ్యాంగ సంస్థలను గుప్పిట పట్టుకుని మత విద్వేషాలను ప్రజలపై రుద్దుతోందని అన్నారు. ట్రంప్ నిర్ణయాలతో ప్రవాస భారతీయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. తీవ్ర నిర్బంధ కాలంలో ధైర్యసాహసాలతో ప్రజల పక్షాన నిలిచిన పోరాటయోధుడు గాదె శ్రీనివాసరెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నారి అయిలయ్య, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, భవాండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, గాదె శ్రీనివాసరెడ్డి సతీమణి, ఐద్వా నాయకురాలు గాదె పద్మమ్మ, కుమారులు గాదె ప్రభాకర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తి నేతాజీ

ఆర్య ప్రతినిధి సభ ప్రధానకార్యదర్శి హరికిషన్ వేదాలంకార్



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హరికిషన్, తదితరులు

నల్లగొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం భిక్ష కాదని, పోరాటం ద్వారానే సాధించుకుందామనే నినాదంతో పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని ఆర్య ప్రతినిధి సభ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధానకార్యదర్శి హరికిషన్ వేదాలంకార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, పరాక్రమ దివస్, జనగణమన ఉత్సవ సమితి వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నేతా జీ రూపొందించిన ఆజాద్ హింద్ ఫౌజ్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను నింపిన విప్లవ నాయకుడు నేతాజీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిత్య జనగణమన గీతాలాపన కేంద్రాల ఇన్‌చార్జీలను వారు సన్మానించారు. అనంతరం నేతాజీ జీవిత చరిత్రపై జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరామిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, కొలనుపాక రవికుమార్, దోసపాటి శ్రీనివాస్, పోలోజు నాగేంద్రాచారి, పోలా జనార్ధన్, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఆర్కే ప్రదీప్, కక్కిరేణి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతలకు మహర్దశ

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

దేవరకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకానికి రూ.1800.62కోట్లతో ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపిందని, త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టుల పనులకు సీఎం అధిక ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, నక్కలగండి ప్రాజెక్టులు పూర్తయితే దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో మూడున్నర లక్షల ఎకరాల వరకు సాగునీరు అందుతుందన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంఏ.సిరాజ్‌ఖాన్, జాన్‌యాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మారేపాకల సురేష్‌గౌడ్, పున్న వెంకటేష్, వెంకటేశ్వరరావు, నేర్మటి సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పవర్‌లూం కార్మికులు

నల్లగొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత పవర్‌లూమ్ సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పవర్‌లూమ్ కార్మికులు సుదీర్ఘకాలంగా సంక్షేమం కోసం పోరాడుతున్నారని, ప్రత్యామ్నాయ ఉపాధులేవీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత మిత్రను పెంచి నగదు బదిలీ ఇవ్వాలన్నారు. త్రిఫ్ట్ పథకం, నేతన్న బీమా పథకాలు ఉన్నా, అమలులో చిత్తశుద్ధి లేక లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదన్నారు. చేనేత బంధు కింద ప్రతీ కార్మికునికి రూ.10లక్షలు ఇవ్వాలని, ఈఎస్ఐ హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని మగ్గాలకు, అనుబంధం వృత్తులకు జియో ట్యాగ్ చేసి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహించి టెస్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. చేనేత ముడి సరుకులపై కేంద్రం జీఎస్టీ రద్దుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో చేనేతరంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ సిబ్బంది యూనిఫాం, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌కు చేనేత వస్త్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుండు వెంకటనర్సు, కర్నాటి వెంకటేశం, కందగట్ల గణేష్, రాపోలు వెంకన్న, గడ్డం దశరథ, గంజి నాగరాజు, జైనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ సమగ్ర అభివృద్ధికి కృషి



దేవరకొండలోఅభివృద్ధి పనులకుశంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు. స్థానిక రహదారిబంగ్లా ఎదుట గురువారం పట్టణంలోని 20 వార్డులో రూ.30 కోట్లతో చేపట్టనున్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే పట్టణం లో ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ సుదర్శన్, ఏఈ రాజు, సిరాజ్ ఖాన్, వడ్త్య దేవేందర్‌నాయక్, కౌన్సిలర్ కొండ్ర మల్లేశ్వరి శ్రీశైలం యాదవ్, హనుమంతు వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు ఘన స్వాగతం



గోరటి వెంకన్నకు పూలబోకేతో స్వాగతం పలుకుతున్న మేనేజర్,ఆర్ఐ


నాగార్జునసాగర్, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు గురువారం సాగర్ లో అధికారులు ఘనస్వాగతం పలి కారు. ఏపీలో బుధవారం జరిగిన పుస్తకావిష్కరణలో పాల్గొని గురువారం తిరిగి హైద రాబాద్‌కు వెళ్తూ హిల్ కాలనీ లోని విజయ విహార్‌లో కొద్ది సేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు విజయవిహార్ మేనేజర్ కిరణ్‌కుమార్, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి పూల బోకే ఇచ్చి స్వాగతం పలికారు.

నిరుద్యోగ కళాకారులను ఆదుకోవాలి

మిర్యాలగూడ. జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని నిరుద్యోగ కళాకారులు సంఘం జిల్లా అధ్యక్షుడు పందిరి సైదులు కోరారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం వారు ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాటాడుతూ కళాకారులను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తున్న ప్రభుత్వం తమను కూడా ఆదుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం-పాటకు పట్టం పేరుతో ఈ నెల 10న జిల్లా స్థాయి కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నందున కార్యక్రమానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కలకొండ శ్రీను, అబ్రహం, రెముడాల శ్రీనివాస్, అంకెపాక కోటేష్, కందుకూరి సుదర్శన్, సైదులు, మధు, వేణు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు

దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్



ఫోన్‌ఇన్ కార్యక్రమంలో భాగంగా సమస్యలు తెలుసుకుంటున్న దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ పట్టణంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ తెలిపారు. అందులో భాగంగా రూ.30 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే పలు వార్డుల్లో పనులకు శంకు స్థాపన చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో గురు వారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు నేరుగా కమిషనర్ కు ఫోన్‌చేసి సమస్యలు వివరించారు.
- (ఆంధ్రజ్యోతి, దేవరకొండ)

కాలనీలో కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నాం
కలారి శ్రీకాంత్,2వ వార్డు
కమిషనర్:కోతుల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో కోతులను పట్టేవారిని రప్పించి కోతులను పట్టి అడవుల్లో వదిలిపెడతాం.

రోడ్లు గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి
వస్కుల సుధాకర్, 2వ వార్డు
కమిషనర్: దేవరకొండలో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాం.

అర్హత ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు ఎందుకు మంజూరు కాలేదు:
పొట్ట మురళీ, 2వ వార్డు
కమిషనర్: జాబితాలో పేర్లులేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు అందజేస్తాం.

సర్వేనంబర్ 750 ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.
వంశీయాదవ్, సుధాకర్
కమిషనర్: వక్ఫ్‌బోర్డు భూముల్లో అక్రమ నిర్మాణాలు జరిపితే నోటీసులిచ్చి, కట్టడాలను నిలిపివేస్తాం.

1వ వార్డులో మూగ జీవాల నీటితొట్లు వినియోగంలోకి తీసుకురండి
నేతాళ్ల వెంకటేష్, 1వ వార్డు
కమిషనర్: నీటితొట్లలో నీరు నింపేందుకు చర్యలు చేప డుతాం. పట్టణంలో అన్ని కాలనీకు రోజు విడిచి రోజుగా కృష్ణా జలాలు అందజేస్తున్నాం.

వీధిలైట్లు వెలగక ఇబ్బందులుపడుతున్నాం
చిత్రం అజయ్‌కుమార్, 4వ వార్డు
కమిషనర్: వీధిలైట్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం:
అర్థం రమేష్, 5వ వార్డు
కమిషనర్: కాలనీలలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. దోమలబెడదను అరిక ట్టేందుకు పాగింగ్ నిర్వహిస్తాం.


కూరగాయల మార్కెట్‌ను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు
గుండాల అంజయ్య యాదవ్
కమిషనర్: ప్రభుత్వ ఆదేశాలమేరకు కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తాం. గతంలో కూరగాయల మార్కెట్ మంజూరైనా స్థల సేకరణలో జాప్యం కారణంగా రద్దయింది. ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.

కాల్వలు శుభ్రం చేయమంటే సిబ్బంది డబ్బులు అడుగుతున్నారు
అజయ్, 1వ వార్డు
కమిషనర్: పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేస్తే వారిపై చర్య తీసుకుంటాం.

నేతాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే

మిర్యాలగూడ. జనవరి 23(ఆంధ్రజ్యోతి): నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శం తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నేతాజీ జయంతి గురువారం గాంధీ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతా జీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడిషనల్ అడ్వకేట్ జనరల్‌కు శుభాకాంక్షలు



తిరుమలగిరి(సాగర్), జనవరి 23(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్న తేరా రజనీ కాంత్‌రెడ్డిని ఏకే ఫౌం డేషన్ ఛైర్మన్, న్యాయ వాది కట్టెబోయిన అనిల్‌కుమార్ గురు వారం కలిశారు. ఈ సంద ర్భంగా అంబేద్కర్ పుస్తకాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ వాసి హైకోర్టులో ఉన్నత స్థానంలో ఉండడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తా



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి

మిర్యాలగూడ. జనవరి 23(ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా ఎన్నుకుంటే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డితో కలిసి మిర్యాలగూడలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇంటింటి సన్నాహక సమా వేశాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత ఎమ్మెల్సీ నిర్వాకం వల్లే 317 జీవో వచ్చిందన్నారు. స్పౌజ్ బదిలీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా తాను కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మైనంపాటి శ్రవన్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ సెక్రటరీ బాలాజీ, ఉపాధ్యా యులు మలిగిరెడ్డి సైదిరెడ్డి, ఉమ్మడి శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రతేజకు నివాళి



చంద్రతేజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగవాని కుంట తండా గ్రామానికి చెందిన బేగంపేట్ డీసీపీ మెగావత్ వెంక టేశ్వర్లు కుమారుడు చంద్రతేజ ప్రథమ వర్ధంతి గురువారం గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి పాల్గొని చంద్రతేజ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు, బీవీ రమణరాజు బాబురావునాయక్, దశరథ, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాటర్ గన్ మిషన్లు అందజేత

నాగార్జునసాగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీ గురుకుల పాఠశాలకు నాట్కో ట్రస్టు ఆధ్వర్యం లో రూ.24 వేల విలువైన వాటర్ గన్ మిషన్లు గురువారం ప్రిన్సిపల్ రాజశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి జీఎల్ఎన్ రావు మాట్లాడుతూ పాఠశాలలో, వసతి గృహం బాత్‌రూమ్ క్లీనింగ్ కోసం మిషన్లు అందజేశామన్నారు. ట్రస్టు సభ్యులు సూర్యనారాయణ, సుధా పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



కేజీబీవీలో రికార్డులను పరిశీలిస్తూ ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈవో భిక్షపతి

తిరుమలగిరి(సాగర్), జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని రానున్న వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో భిక్షపతి అన్నారు. స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించే విధంగా విద్యార్థినిలు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి స్టోర్‌రూమ్‌లో వంట సామాగ్రిని పరిశీలించారు. ఆయన వెంట స్పెషల్ ఆఫీసర్ ఎం.కవిత, టీచర్లు కృష్ణవేణి, హిమబిందు, విమల, రాణి, పుష్పలత ఉన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

చింతపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ టెలీమిడిసన్ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సాయిసన్నిధిలో గుర ువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 150 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి వూరె కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులు కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్, వైద్యులు ఆనంద్ బాబు, రవిచంద్ర, విశ్వకాంత్ రెడ్డి, శ్రీహర్ష, చక్రవర్తి, దిలీప్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

చందంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో శ్రీలక్ష్మీకి కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుంటోజు వినోదాచారి మాట్లాడుతూ రైతులందరికీ రైతు భరోసా ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని ప్రభుత్వం హామీ ఇచ్చిన కౌలు రైతులకు రూ.12వేలు ఇవ్వాలన్నారు కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద ర్‌రెడ్డి, నక్క వెంకటేష్, అంజినాయక్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

డిండి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీసీఎస్ సూపర్‌వైజర్ కల్లు రేణుక అన్నారు మండలంలోని చెర్కుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జరిగిన బేటి బచావో బేటిపఢావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

● చింతపల్లి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియాగౌరారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల మానసికంగా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు.

● చందంపేట,(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్‌దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహిచారు. బాలికలందరూ ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లా లన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

● మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి ,బాలు నాయక్ ● మూడో రోజు కొనసాగిన గ్రామ సభలు ● అర్హులను ఎంపిక చేయాలని పలు గ్రామాల్లో అధికారుల నిలదీత



అడవిదేవులపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



దేవరకొండ : మర్రిచెట్టుతండాలో గ్రామసభలో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

మిర్యాలగూడ రూరల్, అడవిదేవులపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, పథకాలు ఇవ్వకుంటే మరోసారి ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరు,, అడవి దేవులపల్లి గ్రామసభల్లో ఆయన పాల్గొని మాటాడారు. గూడూరు గ్రామసభలో అర్హుల జాబితాలో తమ పేర్లు రాలేదని అధికారులను గ్రామస్థులు నిలదీశారు. జాబితా తప్పుల తడకగా ఉందని నిరసన వ్యక్తం చేయడంతో గ్రామసభ రసాభసాగా మారింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయని ఆందోళన చెప్పడంతో కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఎమ్మెల్యే కలుగచేసుకోని పేర్లు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్,పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రాజు, ఏవో సైదానాయక్, రూరల్ ఎస్ఐ లోకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేర్లు లేవని ఆందోళన చెందొద్దు

చింతపల్లి, డిండి, (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల్లో వెల్లడించిన జాబితాల్లో తమ పేర్లులేవని ఏ ఒక్కరూ కూడ ఆందోళన చెందవద్దని, అర్హులకు పథకాలు అందిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం చింతపల్లి మండలం వింజమూర్, కుర్మేడ్, డిండి మండలం బొలనపల్లి, డిండి, వీరబోయినపల్లి గ్రామసభల్లో ఆయన మట్లాడారు. పూరిగుడిసె కలిగినవారు, వితంతు మహిళలు, దివ్యాంగులు, రేకుల ఇల్లు కలిగినవారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయడం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా పేదలందరికి ప్రభుత్వ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వలక్ష్యమని చెప్పారు. అలాగే డిండి మండల కేంద్రంలో రూ20 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవో రమణారెడ్డి, మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలుసంజీవ రెడ్డి, ఎంపీడీవోలు సుజాత, వెంకన్న తహసీల్దార్ రమా కాంత్ శర్మ, మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, ఏపీవో శౌరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాగా ర్జున రెడ్డి, సిరాజ్‌ఖాన్, రాంకిరణ్, గుర్రం రాములు, బూషి పాక వెంకటయ్య, పొలం లక్ష్మణ్, గడ్డమీది సాయి, నూకం వెంకటేష్, పాల్గొన్నారు.

గ్రామసభల్లో దరఖాస్తు సమర్పించాలి

పెద్దఅడిశర్లపల్లి,(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు గ్రామసభలో దరఖాస్తు సమర్పించాలని డీఆర్డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి మండలంలోని ఘనిపల్లి, జి.బీమనపల్లి, మల్లాపురం గ్రామ సభలకు హాజరయ్యారు. ఘట్‌నెమలిపురం, పుట్టంగండి, ఘనిపల్లి, పెద్దగుమ్మడం, పెద్దగట్టు, పడమటి తండా, జి.భీమనపల్లి, మల్లాపురం గ్రామాల్లో ఎంపీడీవో, తహసీల్దార్లు ఎంఈవోలు,వ్యవసాయ అధి కారులు, ఏపీవోలు బృందంగా ఏర్పడి గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్ర మౌళి, తహసీల్దార్లు మధుహాసిని, శ్రీనివాస్‌రావు, ఎంఈవో వెంకటయ్య, శ్రీనయ్య, ఏవో పాండు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● వేములపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపాలెం, సల్కునూరు, అన్నపరెడ్డిగూడెం గ్రామ సభల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడారు. ఆయా గ్రామ సభల్లో జాబితా చదువుతున్న నిజమైన పేదవారికి జాబితాలో చోటు లేదని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ కార్యకర్తలు జోక్యం చేసుకోవడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. స్పందించిన ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయకులకు సర్దిచెప్పడంతో సభలు సాఫీగా సాగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో శారదాదేవి, ఎంపీవో లలిత, ఎంఏవో కిశోర్‌నాయక్, ఏఈఓలు రేఖా, సాయిరెడ్డి, కార్యదర్శి నవీన్, దివ్య, నాయకులు బుసి రెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లా వీరయ్య, పెదమాం చంటి, కట్టా మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి

దేవరకొండ,(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులతోపాటు ప్రభుత్వ పథకాలన్నింటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అన్నారు. గురువారం దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా గ్రామపంచాయతీలో గ్రామసభలో పాల్గొన్నారు. మర్రిచెట్టు తండాలో స్వశక్తితో మహిళలు సంప్రదాయ గిరిజన దుస్తులను చేతితో సూది దారంతో కుట్టి విదేశాలకు పంపించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అఖిల్, మాజీ సర్పంచ్ శీనునాయక్, మాజీ ఎంపీటీసీ రాంసింగ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి కీర్తి, ఏఈవో ధరణి, కిషన్‌బావోజీ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్నాం.. ఎందుకు రాలేదు

ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డులకు, ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్నాం. గ్రామసభలో ప్రకటించిన జాబితాలో పేర్లులేవు. అర్హత ఉన్నప్పటికి ఎందుకు ఇళ్లు, రేషన్‌కార్డులు రాలేదు. దరఖాస్తులు చేసుకుంటే మళ్లీ ఎన్నాళ్లకు ఇస్తారు అని తాటికోలులో గ్రామస్థలు అధికారులను ప్రశ్నించారు. దీంతో మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మీబాలనారాయణగౌడ్, మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని, అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందజేస్తామని తెలపడంతో శాంతించారు. దేవరకొండ సీఐ నర్సింహులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అరుపులు, కేకలతో గందరగోళం

నిడమనూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో శాఖాపురం, ముప్పారం, ఎర్రగూడెం, నారమ్మగూడెం, మారుపాక, నూరెపల్లి, సోమారిగూడెం, వెంకటాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. శాఖాపురం, ముప్పారం, ఎర్రగూడెం గ్రామసభల్లో ప్రజల అరుపులు, కేకలతో గందరగోళం ఏర్పడింది. లబ్ధిదారుల జాబితా తప్పులతడకగా ఉందని, జాబితాలో అర్హుల పేర్లు లేవని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీశారు.మళ్లీ సర్వే చేసి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల్లో గందరగోళం నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్ది చెప్పాల్సి వచ్చింది. ఆయా గ్రామసభల్లో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో గుర్రం వెంకటేశం, ఏవో మునికృష్ణయ్య, ఏఈ పీఆర్ సాయిప్రసాద్, ఎంఈవో లావూరి వెంకన్న, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకన్న, ఆర్ఐ దాడి రాజిరెడ్డి, ఏఈవో విజయచంద్ర, కార్యదర్శి గంగుల లింగయ్య, మాజీ సర్పంచ్ చేకూరి వంశీ, లాజర్, శ్రీను పాల్గొన్నారు.

● హాలియా,(ఆంధ్రజ్యోతి): హాలియా పట్టణంలోని 3,7,11వ వార్డుల్లో అనుముల మండలం చల్మారెడ్డిగూడెం, కొట్టాల, నాయుడుపాలెం, కొరివేనిగూడెం, హజారీగూడెం, మదారిగూడెం, పేరూరు గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో సభల్లో పాల్గొని వారి సమస్యలు, అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీడీవో సు జాత, యడవల్లి నరేందర్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, పిల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఏమయ్యాయంటూ నిలదీత

కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఅడిశర్లపల్లి, చింతకుంట్ల, గౌరికుంటతండా, జానిగాని తండా, గన్యానాయక్‌తండా, చింతచెట్టు తండాల్లో గ్రామ సభలు నిర్వహించారు. చింతకుంట్ల, గౌరికుంట తండా పంచాయతీల్లో అధికారులపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇటీవల రేషన్ కార్డుల కోసం, కులగణన సర్వే చేపట్టారని, ఆ సర్వేలో ఇంటింటికీ వెళ్లి నిజమైన లబ్ధి దారులను ఎంపిక చేశారని, కానీ గ్రామసభల్లో వాస్తవ లబ్ధిదారులను విస్మరించారని ఆరోపించారు. చివరకు పోలీ సులు జోక్యం చేసుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. చింతకుంట్లలో నిర్వహించిన గ్రామ సభలో ప్రత్యేక అధికారి ప్రశాంత్ మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని, ప్రస్తుతం నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



వేములపల్లి : శెట్టిపాలెంలోతహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు



కొండమల్లేపల్లి : చింతకుంట్లలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు



నిడమనూరు : శాఖాపురం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు